
# విద్యార్థి వెలుగు

Volume III-Issue I

January 2020





సంపాదకీయం

# క్రొత్త సవాళ్ళు

## " మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము" - మోషే

నూతన సంవత్సరం లోనికి ఆహ్వానించబడ్డాము. మన ఆశలు, ఆశయాలు, ప్రణాళికలు, లక్ష్యాలు, ఉద్దేశ్యాలు, తీర్మానాలు, సమర్పణ ఇంకా ఎన్నో... ఎన్నో అంశాలలో పాత గూటిని వదలిన సీతాకోకచిలుకలా నూతన ప్రపంచంలోకి అడుగుపెట్టాము. దేవుని వాగ్దానాలు, హెచ్చరికలు, ఆశీర్వాదాలు ఆవరించివున్నాయనే ధైర్యముతో రంగుల వలయాలను దాటుకుంటూ ముందుకు సాగడానికి ప్రారంభించాము. కాని అదే స్థాయిలో మన ముందు క్రొత్త సవాళ్ళు కాపుకాస్తున్నాయి.

క్రీ.పూ 1446లో 430 సంవత్సరాల సుదీర్ఘ బానిసబ్రతుకు నుండి ఇశ్రాయేలీయులు విడుదల పొంది రామసేసు నుండి సుక్కోతుకు ప్రయాణం ప్రారంభించారు. మోషే ఆరు లక్షల మంది ప్రజలకు నాయకత్వము వహిస్తూ వారిని ముందుకు నడిపిస్తున్నాడు. బాహుబలము చేత యెహోవా మనలను ఐగుప్తు నుండి బయటకు రప్పించాడనే ఉత్సాహములో ఇశ్రాయేలు ప్రజలు ముందుకు సాగుతున్నారు. పగలు, రాత్రి ప్రయాణంలో వారిని నడిపించడానికి దేవుడు మేఘ స్థంభంలోనూ, అగ్ని స్థంభంలోనూ ఉండి వారిని ముందుకు నడిపిస్తున్నాడు. ఆ గొప్ప అనుభవంలో ఇశ్రాయేలీయులు ఎంత ఆనందించారో... ఎంతగా బలము పొందారో! సుక్కోతు నుండి ఎఱ్ఱ సముద్ర తీరము వరకు ప్రయాణించి అక్కడ మజిలీ చేసారు. ఆరు లక్షల హృదయాలు కృతజ్ఞతతో దేవుని వైపు చూసారేమో! తమను పదిలంగా తీరం వరకు చేర్చినందుకు. కాని ముందెన్నడు ఎదుర్కొనని క్రొత్త సవాలు వారి జీవితాలలో ఎదురైంది. ఆరు వందల రథాలతో వస్తున్న ఫరో సైన్యపు ధూళి మేఘాలకు ఇశ్రాయేలు ప్రజల మస్తిష్కాలలో సణుగుల మేఘాలు కమ్ముకున్నాయి.

నాయకుడైన మోషే జీవితంలో మునుపెన్నడూ చూడని, ఎదుర్కొనని క్రొత్త సవాళ్ళు. ఎవరికోసమైతే ఫరో కుమార్తె కుమారుడని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదో వారి నుండే అసంతృప్తి, తిరుగుబాటు కేకలు మిన్నుముట్టాయి. వెనుక నుంచి ఫరో సైన్యాలు సమీపిస్తున్నాయి, ఎదుట నుంచి సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. మోషే ఎదుట క్రొత్త సవాళ్ళు. ఆకాశం వైపు చూచి మొఱపెట్టే మోషేను ఇశ్రాయేలు ప్రజలు చూస్తున్నారు. ఆశ్చర్యం... మోషే తన చేతి కర్రను సముద్రం వైపు చాచాడు. బలమైన తూర్పు గాలి ప్రారంభమైంది. మేఘ స్థంభము ఇశ్రాయేలీయులకు ఫరో సైన్యానికి మధ్య నిలిచింది. ఎర్ర సముద్రం విభజించబడింది. ఆరు లక్షల దేవుని ప్రజలు ఆరిన నేలపై నడుచుకుంటూ క్షేమంగా దాటిపోయారు. మోషే చెయ్యి చాపగా అధికబలంతో సముద్రం తిరిగి పొర్లిపోయింది. ఫరో సైన్యం సముద్ర గర్భంలో కలిసిపోయింది.

తన ప్రజల పక్షాన దేవుడు యుద్ధం చేస్తాడని శత్రువు గ్రహించడానికి, దేవుని యందు, ఆయన సేవకుడైన మోషే యందు ఇశ్రాయేలు ప్రజలు నమ్మకముంచడానికి ఈ క్రొత్త సవాలు కారణమైంది. మోషే అందుకే అంటాడేమో! నా దినములలో ఎదుర్కొనే ప్రతి సవాలు ద్వారా నేను ఆత్మీయ పాఠాలు నేర్చుకోవడం నాకు నేర్పు దేవా...

నేటి దినాలలో సమాజం, కుటుంబం, పరిచర్యలో క్రొత్త సవాళ్ళు మనకు ఎదురవుతున్నాయి. అభద్రత, వివక్షత, పారదర్శకత లోపం, నేర ప్రవృత్తి, స్వార్థపూరిత శిక్షలు, శృతిమించిన తేడాలు, నీతి న్యాయాలను తెరమరుగు చేసే చట్టాలు సమాజం ఎదుర్కొంటుంటే, పాడైపోతున్న సంబంధబాంధవ్యాలు, మౌనం రాజ్యమేలుతున్న కుటుంబాలు, నువ్వా, నేనా అనే సమాధానం లేని ప్రశ్నలు కుటుంబ పునాదులను కుదుపుతున్నాయి. ఇక పరిచర్యలో సత్యాన్ని, సిద్ధాంతాన్ని కాపాడుకోవలసిన పరిస్థితులు, రాశికి వాశికి మధ్య తేడాలు, యథార్థతకు వెలుగు అవసరాలు, కారణాలు కనబడని సమూహాలు, సమస్య కేంద్రం కాక వ్యక్తి కేంద్రమైన సమస్యలు, ధ్యానాన్ని అధిగమిస్తున్న జ్ఞానం, మారుతున్న ప్రాధాన్యతలు. ఇలా ఎన్నో క్రొత్త సవాళ్ళు.

ఈ నూతన సంవత్సరములో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనడంలో మోషే వలె దేవుని వైపు చూడడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. మన పక్షాన యుద్ధం చేసేది దేవుడని తెలుసుకోవాలి. నిదానించి కనిపెట్టడం నేర్చుకోవాలి. మన మధ్య ఆయన సన్నిధిని గుర్తించగలగాలి. ఆయన కార్యాలు మనలో నూతన పరచడానికి మనం అవకాశం ఇవ్వాలి. శత్రువుల మధ్య ఆయన మహిమపరచబడడానికి నీ, నా జీవితం కారణం కాగల మాదిరిని ఆయనలో పొందాలి. నూతన సవాళ్ళను అధిగమించి ఈ విద్యా సంవత్సరములో విద్యార్థి దర్శనాన్ని కళాశాల ప్రాంగణాలలో కొనసాగించుటకు దేవుడు సహాయం చేయును గాక. ఈ త్రైవార్షిక ఆత్మీయ సదస్సులో యుఇయస్ఐ-టియస్ కుటుంబంగా మనలను మనం సమర్పించుకుందాం.

**- సహో. విజయ్ ప్రసాద్,**

**January 2020**
**VIDYARTHI VELUGU**
A publication of the UESI-TS
Publication Trust

# contents


1. **NEW DECADE & NEW CHALLENGES** 4
2. మహిళ భద్రతకు సూచనలు 6
3. ఆడపిల్లల సంరక్షణ 8
4. కనుల ముందున్నా కనిపించని సవాళ్ళు 11
5. వి.యస్.అజరయ్య-భారతదేశంలో ఆంగ్లికన్ చర్చ్ తొలి బిషప్ 13
6. **THE DOCTRINE OF TRINITY** 20
7. వీర వనిత యాయేలు 23
8. నిజమైన శత్రువు నుండి దేవుని కాపుదల 25
9. ఎటెన్షన్ టు అడిక్షన్ 28


## EDITORIAL BOARD

Editor and Publisher:
Mr. Sudhir Kumar Gaddam, Hyderabad.
Managing Editor: Mr. Vijay Prasad, Hyderabad.
Litt. Dept. Secretary: Mr.Nani Babu, Hyderabad.
**Members:**
Dr. Mercy Sujatha, Hyderabad.
Mrs. Ruth Vinay, Rangareddy.
Mr. Michael Fernandez, Hyderabad.
Mr. Simon, Hyderabad.
Mr. Enoch.Y., Khammam.

## UESI-TS Account Details

Account Name: UESI-TS
Bank: State Bank of India
Branch: Barkatpura A/c. No.:**35233350086**
IFSC code: SBIN0007641
Kindly inform the office after depositing
Ph. 7386598974/ 8074042465

## V V & LITERATURE ACCOUNT DETAILS

Name – UESI PUBLICATION TRUST
A/C NO – 0624101037187
Bank – Canara Bank
Branch – East Maredpally,Secunderabad
IFSC – CNRB0000624
Kindly inform office or SMS after depositing amount to
Cell – 7386598974/ 8074042465
Note:This account is only for VV & Literature Purchases

**Themes (Feb'20 to June'20)**
February'20 - Exams – పరీక్షలు
March'20 - Woman – స్త్రీ
April'20 - Resurrection – పునరుత్థానం
May'20 - Self Esteem – ఆత్మగౌరవం
June'20 - Peer pressure – తోటివారి ఒత్తిడి




*You crown the year with your bounty; and your carts over-flow with abundance.*

Psalm 65:11

'విద్యార్థి వెలుగు'
పాఠకులకు
*Happy New Year*

– ఎడిటోరియల్ బోర్డు,
యు.ఇ.యస్.ఐ-టి.యస్





# NEW DECADE & New Challenges

**In a blink** of an eye, a magnificent and wonderful decade has blossomed and died. It left few sweet memories and many more nostalgic feelings. But what sprouted out are new challenges and opportunities for fresh and new beginnings. Life is full of challenges, but these challenges are given to us to strengthen our faith and build our character. We can't exactly predict our individual challenges, God alone knows as he is beyond time. But He brings those challenges to us to make us better and not bitter.

**The church**, which is the body of Christ that vanishes from earth in a blink of an eye when the trumpet sounds will face tough times in the coming decade. We can foresee a number of challenges. Within the Church we foreseeBiblical illiteracy, apostasy,syncretism,decline in mission work,shallow leadership and love for materialism.

**From outside** we foresee emerging cultures, ethnic cleansing, rational and religious discrimination, threat to national secular fabric, death of democracy, raise of tough fundamentalist groups, curtail on freedom to religious proclamation, threat to national integrity,global warming and threat to the world peace are some of the challenges stored up in the new decade.

**40 years of wilderness** journey of the Israelites seems to be finished in a blink of an eye. Situations were rapidly changing, as the Israelites gathered east of Jordan and at the edge of the Promised Land. On one hand these travelling people are physically exhausted and spiritually drained out. And on the other,they are going to face new challenges as they are about the entire new phase of life in the Promised Land.

**Firstly,** it's about new and young leadership. Moses the great leader who led them in this tortuous journey has to leave and new and young Joshua is going to take up the baton. **Secondly,** it's about new and fragile generation. From the old generation only Joshua and Caleb who followed the Lord wholeheartedly were privileged to enter the land.**Thirdly**, it's about the strong and unyielding nations already existing in the promised land. Israelites have to conquer them though they seem to be grasshoppers before them

and occupy their land. **Fourthly**, it's about the polytheistic gods of the other nations like Baal, El, Asherah, Astarte and many more. These gods are a constant threat to their devotion to Lord God. In the midst of these new and emerging challenges, experienced leader Moses exhorts the nation to focus their attention on the never changing **Word**. He preached to them for the second time to the new generation and is recorded in Deuteronomy, the fifth book of the Pentateuch.

**No other Old Testament** books have exerted a greater influence on the formation and development of Christian thought and practice than Deuteronomy. Its doctrines laid foundation to the Christian faith. Kings and priests were reminded and warned about the consequences of neglecting its teachings. Prophets understood its implications and challenged people and the kings.

**Psalmists** drew their theology in terms of exaltation, adoration, confession and even intercession. More than any one else our Lord Jesus Christ treasured its distinctive message and quoted its words in his personal and public ministry. He confronted the devil on the mountain with its right interpretation, *" Man does not live on bread alone but on every word that comes from the mouth of the Lord ".*

**But the million** dollor question that still trouble us is how can this exciting book which was written 3000 years ago can educate, encourage and empower us? Is the book relevant to our changing and challenging times?and the answer to all these questions is a big fat yes.

**The book of** Deuteronomy that is a part of the inspired scripture continues to make its authority appeal to the modern challenges in their context. It imprints on our feeble minds that our God is sovereign, compassionate and generous. The one who redeemed His people from iron -smelting furnace is still the same and unchanging.

**It also helps** us to widen our horizons of our ethical and social responsibilities. It warns us about the consequences of worshipping modern gods and encourages us for wholehearted devotion. It promises blessing beyond our imaginations if we follow his Word and cursing if we neglect. In a nut shell the book promises God's presence and power as we face challenges from with in and from outside.

**Late Rev. Dr. John Stott**once when asked to comment in three or four words on the progress of the Church, this experienced man said **' growth without depth'.**At the dawn of the new decade, let us commit ourselves to be excellent students of the Word of God. Let us kick off every god that incarnates in various materialistic forms and biblical illiteracy and build our faith and future on the Word of God. We shall overcome every new and emerging challenge with the victorious Lord on our side.**New decade belongs to the Lord.**

**Sudhir Gaddam**



# మహిళ భద్రతకు సూచనలు

- వాక్యానుసారం

'దిశ' సంఘటన మరోసారి దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఢిల్లీలో 'నిర్భయ' సంఘటన, కాశ్మీరులో 'కథువా బాలిక', ఇలాంటి అకృత్యాలకు బలైపోతున్న ఆడపిల్లలు ఎందరో. మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. దేశమంతా ఎక్కడో ఒకచోట ఇటువంటి అఘాయిత్యాలు జరుగుతూనే వున్నాయి. ఆపదలో చిక్కుకున్న సమయంలో ఎలా స్పందించాలన్న అవగాహన లేకపోవడంతో అనేకులు ప్రాణాలను కోల్పోతున్నారు. అపత్కాలంలో ఏమి చేయాలి? అనుకోని సంఘటనలను ఎలా ఎదుర్కోవాలి? ప్రముఖ దిన పత్రికలలో నిపుణులు ఇచ్చిన సలహాలను కొన్నిటిని మీకు తెలియజేస్తున్నాం.

**కొన్ని సాధారణ భద్రతా సూచనలు:**

1. మీ పరిసరాలను గుర్తించండి. మిమ్ములను మీరు సురక్షితం చేసుకోండి. మీకు ఏదైనా అభద్రతగా అనిపిస్తే వెంటనే ఆ ప్రదేశం నుండి బయటపడండి.

2. మీ యొక్క ధైర్య సాహసాలను ప్రదర్శించండి. 'ఆత్మ బోధనకు లోబడండి.

3. 'ఈవ్ టీజింగ్' ను తేలికగా తీసుకోకండి. అటువంటి వారిని ఫోటో తీయడానికి ప్రయత్నించండి. బిగ్గరగా అరుస్తూ మిగతా ప్రజల దృష్టికి వినబడేట్లుగా వారిని ఎదుర్కోండి.

4. ఎక్కువ ఆలస్యం అయిన సందర్భాలలో జనం ఎక్కువగా ఉన్న బస్సులోనే ప్రయాణించండి. పాసింజర్లు తక్కువగా లేదా అసలే లేని బస్సులను ఎక్కకండి.

5. స్కూటర్ వంటి ద్విచక్ర వాహనాలను ఉపయోగించేవారు హెల్మెట్ ధరించండి. కొత్తవారి కొరకు వాహనాన్ని ఆపకండి. మీ మీద దాడి జరిగితే హెల్మెట్‌ను ఆయుధంగా ఉపయోగించండి.

6. కారును నడుపుతున్నట్లయితే నిర్జన ప్రదేశంలో పార్క్ చేయకండి. కారు ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు వెనుక సీటును ఒకసారి చెక్ చేయండి. మీరు కారు ఎక్కగానే లాక్ చేసి వెంటనే సహాయం కొరకు కాల్ చేయండి. క్రొత్త వారికి లిఫ్ట్ ఇవ్వకండి. తెలిసిన దారిలోనే ప్రయాణించండి. షార్ట్ కట్ రూట్లను, మీకు తెలియని రోడ్లలో ప్రయాణించకండి.

7. ప్రయాణం చేసేటప్పుడు మీ ఫోన్ అందుబాటులో ఉంచుకోండి. మిమ్ములను దాడి చేసేవారు మొదట చేసే పని ఫోన్‌ను పారవేయడం. కనుక స్పీడ్ డయల్‌ను ఎమెర్జెన్సీ కొరకు ఏర్పాటు చేసుకోండి. మీరు త్వరగా ఫోన్‌ను తీసి డయల్ చేసి వదిలివేయండి. మీరు ఉన్న లొకేషన్‌ను బిగ్గరగా అరుస్తూ చెప్పడానికి ప్రయత్నించండి. దాని వలన కాల్ అందుకొన్న వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడం సులభం అవుతుంది.

8. స్మార్ట్ ఫోన్ ఉన్నట్లయితే ఎమర్జెన్సీ యాప్‌లను డౌన్ లోడ్ చేసుకోండి.

9. మీరు డ్రాప్ అయిన తరువాత బయటే ఉండి కాల్ చేయకండి. మీ గృహంలోనికి వెళ్ళిన తరువాత ఫోన్ వాడండి.

10. ఎవరైన మిమ్ములను వెంబడిస్తూ ఉంటే జన సంచారం ఉన్న ప్రదేశానికి వెళ్ళి అక్కడ బిగ్గరగా అరచుటకు ప్రయత్నించండి. ఈ విషయాన్ని కుటుంబం లేదా స్నేహితులకు చెప్పడానికి సందేహించకండి.

11. ఏదైనా కఠినమైన పరిస్థితిలో ఉంటే నీ చేతిలో ఉన్న వస్తువు ఏదైనా సరే దానితో స్వయం రక్షణకు పూనుకోండి. తాళపు చెవులు, బాటిల్ మీ పర్స్ మొదలైన వస్తువులను దాడి చేస్తున్న వ్యక్తులను అడ్డగించడానికి ఉపయోగించండి.

12. అత్యాచారం వంటి సందర్భాలలో ఎదురు దాడి చేస్తూ వారిని ప్రతిఘటించాలి. దాడి చేసే వ్యక్తి కాళ్ళ మధ్యలో గట్టిగా కొట్టండి. వాళ్ళ కళ్ళు, మెడ, కడుపు, ఛాతీ పైన గాయపరచడానికి ప్రయత్నించండి.

13. మిమ్ములను వేధింపులకు గురిచేస్తూ నిత్యం వెంటాడుతున్న వ్యక్తుల గురించి ముందే మీ కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు తెలియజేయడం ద్వారా అపాయం నుండి తప్పించుకోగలరు.

**పెప్పర్ స్ప్రే:** చదువులు, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఒంటరిగా వెళ్ళే మహిళలు ఎవరైనా ఆగంతకుడు దాడి చేస్తున్నప్పుడు పెప్పర్ స్ప్రేని ఉపమోగించవచ్చు. దీనిని సులభంగా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. కారం, మిర్చి

ఫ్లేక్స్, మిరియాల పొడి, నూనె, కొంత వెనిగర్ కలిపి చేయవచ్చు. నూనె తప్ప మిగిలిన వస్తువులను ఒక గిన్నెలో కలిపి దానికి వెనిగర్ కలపాలి. ఈ మిశ్రమం ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి వెనిగర్ సహాయపడుతుంది. దీనికి నూనె కలిపి స్ప్రే బాటిల్‌లో నింపాలి. గట్టిగా మూత బిగించాలి. ఎవరైనా దాడి చేయడానికి వచ్చినప్పుడు ఎదురు తిరగడానికి వారి నుండి రక్షించుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. దీనిని తయారు చేసే సమయంలో కళ్ళజోడు పెట్టుకొని చేతులకు గ్లౌజులు ధరించాలి.

**మొబైల్ లేదా ఆన్‌లైన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

మనం ఎక్కువగా కంటికి కనిపించే ప్రపంచంలోని భద్రత గురించే ఆలోచిస్తాం. కాని కంటికి కనిపించని అదృశ్యంగా వేధించే సైబర్ దాడులు ఈమధ్య కాలంలో ఎక్కువగా జరుగుతూ ఉన్నాయి. వాటి నుండి మనలను మనం ఏవిధంగా రక్షించుకోవాలి?

1.ఒక్కసారి ఆన్‌లైన్‌లో పెట్టిన ఏ సమాచారమైనా హ్యాక్ అవ్వడానికి ఆస్కారం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడేటప్పుడు మీ లొకేషన్‌ను షేర్ చేయకండి.

2.ఫోన్ రీచార్జ్ చేయించుకొనే సమయంలో తెలిసిన వ్యక్తి గదా అని మీ నంబర్ అతనికి ఇవ్వకండి. వీలయితే టాప్‌అప్ కార్డులను ఉపయోగించండి.

3.ఆఫర్లలో తక్కువ ధరకు లభిస్తున్నాయని ఏదో ఒక లింక్‌లోనికి వెళ్ళి కొనుగోళ్ళు చేయవద్దు. గుర్తింపు పొందిన సంస్థల షాపింగ్ యాప్‌లనే ఉపయోగించండి. మీ వ్యక్తిగత వివరాలు రిజిస్టర్ చేయకండి. డెలివరీ బాయ్స్ విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

4.ఇంటర్నెట్ కేఫ్‌లలో వ్యక్తిగత ఈ-మెయిల్, ఫేస్‌బుక్ వంటివి ఉపయోగించినప్పుడు లాగ్ అవుట్ అవ్వాలి.

5.వెబ్‌సైట్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసేవారు ఆ సంస్థ గురించి పూర్తిగా తెలిసికోవాలి. మీ పూర్తి చిరునామా ఇవ్వకుండా ఈ-మెయిల్ ఇస్తే సరిపోతుంది.

6.సైబర్ నేరగాళ్ళకు మీ సమాచారం తెలియకుండా ఉండాలంటే డబుల్ ఫోన్ చిట్కాను పాటించవచ్చు. వ్యక్తిగత అవసరాలకు ఒకటి, జాబ్ అప్లికేషన్ లేదా సామాజిక మాధ్యమాలకు మరొకటి వినియోగించడం మంచిది.

7.అపరిచిత వ్యకులకు వ్యక్తిగత విషయాలను షేర్ చేయకండి. ప్రైవసీ సెట్టింగ్స్‌ను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

**సోషల్ ట్రోలింగ్:**ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసికొని బురద చల్లే ప్రయత్నాలు సోషల్ ట్రోలింగ్ అంటారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే అవకాశాలు ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**కెమెరా హ్యాకింగ్:**లాప్ టాప్. ట్యాబ్‌లను వాడేవారు అవసరం ఉంటేనే వైఫై, ఇంటర్నెట్‌ను కనెక్ట్ చేసుకోవాలి. కొన్ని రకాల మాల్‌వేర్‌లను మీ పరికరాల్లోనికి పంపి మీకు తెలియకుండానే మీ సమాచారాన్ని దొంగిలిస్తారు. వెబ్‌సైట్లు చూస్తున్నప్పుడు వచ్చే అటాచ్‌మెంట్ల ద్వారా ఫోన్, లాప్ టాప్‌లకు మాల్‌వేర్‌ను పంపిస్తారు. కెమెరా హ్యాక్ చేసే అవకాశం ఉంది గనుక బాత్‌రూమ్‌లలో ఫోన్ వాడరాదు.

సైబర్ లేదా డిజిటల్ ప్రపంచంలో ఏమరుపాటుతో నిర్లక్ష్యంగా ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా మనం అనేక ఇబ్బందుల నుండి తప్పించుకోగలము.

**అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడే వనరులు:**

♦డయల్ 100కు ఫోన్ చేయాలి. దీని ద్వారా జిపియస్ ఆధారంగా త్వరగా పోలీసులు సంఘటనా స్థలాన్ని గుర్తించి వచ్చే అవకాశం ఉంది.

♦దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్లు 112, 1090, 1091 లకు ఫోన్ చేయవచ్చు.

♦తెలంగాణ రాష్ట్రంలో 'షి' బృందాలు ఏర్పాటు చేసిన 040-27852155 లేదా వాట్సాప్ నంబర్ 9490616555కు ఫిర్యాదు చేయవచ్చు.

♦హాక్ ఐ:మహిళల భద్రత కొరకు రాష్ట్ర పోలీస్ శాఖ 'హాక్ ఐ' మొబైల్ అప్లికేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆ అప్లికేషన్‌లోని ఎస్.ఒ.ఎస్ (సేవ్ అవర్ సోల్) బటన్ నొక్కితే చాలు పోలీసులు స్పందిస్తారు. రెండు రోజుల్లో 2.5 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్న ఈ యాప్ మహిళలందరూ తమ భద్రత నిమిత్తం ఉపయోగిస్తే మంచిది.

♦జీరో ఎఫ్.ఐ.ఆర్:ఇక పై ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిధితో సంబంధం లేకుండా పోలీసులు కేసు (జీరో ఎఫ్.ఐ.ఆర్) నమోదు చేసుకుంటారు. నిర్భయంగా తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయవచ్చు.

'దిశ' సంఘటన జరిగిన తరువాత అనేక వాట్స్ ఆప్ మెసేజ్‌లు భద్రత గురించి అనేకులు షేర్ చేస్తూ ఉన్నారు. వాటిలో ఏవి యథార్థమైనవో లేదా నకిలీవో (ఫేక్) పరిశీలించి నిర్ధారణకు వచ్చిన తరువాతనే వాటిని వినియోగించండి.

(ఈ వ్యాసంలోని సూచనలు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' మరియు 'ఈనాడు' దినపత్రికలలో నుండి తీసుకోబడినవి)

**-సహోదరి. రూత్ వినయ్,** రంగారెడ్డి జిల్లా.





# ఆడపిల్లల సంరక్షణ

పిల్లలు దేవుని ఆశీర్వాదము (ఆది 1:28; కీర్త 128:3-4), గర్భ ఫలము ఆయనిచ్చు బహుమానము, స్వాస్థ్యము (కీర్త 127:3-5) అని బైబిల్ స్పష్టంగా చెబుతుంది. ప్రతి వ్యక్తి పట్ల దేవుడు ప్రత్యేకమైన ఉద్దేశ్యము (యిర్మీ 29:11), ప్రణాళిక (యెష 55:8,9) కలిగి ఉంటారు. కాబట్టి బిడ్డలను దేవునికి సమర్పించి, వారు దేవుడు ఆశించిన మార్గములో నడుస్తూ, అన్ని రంగాలలో నిష్ణాతులగునట్లు పెంచవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంది. దాని కొరకు పిల్లలకు అన్ని విషయాలను ప్రేమతో బోధిస్తూ (ద్వితీ 6:6,7), శిక్షణనివ్వాలి (సామె 22:6).

యేసు జ్ఞానమందును (మానసికంగా), వయస్సునందును (భౌతికంగా), దేవుని దయయందును (ఆత్మీయంగా), మనుష్యుల దయయందును (సాంఘికంగా) వర్ధిల్లుచుండెను – లూకా 2:52, బాలుడైన యేసు ఈ లోకంలో తల్లిదండ్రులైన మరియమ్మ, యోసేపుల సంరక్షణలో ఎదిగిన విధానాన్ని తెలియజేస్తుంది. అదే మాదిరిలో మనం కూడా మన బిడ్డలను పెంచాలి. ఏ ఒక్క అంశంలో లోపం జరిగినా పిల్లల ఎదుగుదల సమగ్రంగా ఉండదు. కొంతమంది తల్లిదండ్రులు ఉద్యోగ బాధ్యతలు, పరిచర్య లేక ఇతరమైన వాటిలో బిజీగా ఉంటూ పిల్లల విషయంలో తీసుకోవలసినంత శ్రద్ధ తీసుకోక పోవడం గమనిస్తున్నాము.

**భౌతిక ఎదుగుదల:**

కాబోయే ప్రతి తల్లి ముందు నుండి పౌష్టికాహారాన్ని తీసుకుంటూ గర్భధారణకు సిద్ధపడాలి. ముఖ్యంగా రక్తహీనత లేకుండా చూసుకోవాలి. ఆరోగ్య సమస్యలేవైనా ఉన్నా, మందులేవైనా వాడుతూ ఉన్నా వైద్య సలహాలు తీసుకోవడం అవసరం. గర్భం ధరించాక రెగ్యులర్‌గా డాక్టర్‌ను కలవడం, వారి సూచనల మేరకు పరీక్షలు చేయించుకుంటూ, మంచి ఆహారం, మందులు తీసుకోవాలి. లేదంటే తల్లీ బిడ్డలకు ప్రమాదకర పరిస్థితులు ఎదురుకావచ్చు. బిడ్డ భౌతిక ఎదుగుదలకు ఇదే పునాది. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రతిరోజూ ప్రత్యేకంగా ప్రార్థించాలి. ఇక్కడ తండ్రి పాత్ర తక్కువేమీ కాదు. తల్లి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేలా చూడాలి. దేవుడిచ్చే అపురూపమైన బహుమానాన్ని స్వీకరించటానికి భార్య భర్తలిరువురు అన్ని విధాల సిద్ధపడాలి.

పెరుగుతున్న పిల్లల అవసరాలకు తగిన పౌష్టికాహారాన్ని ఇంట్లోనే తయారు చేసి ఇవ్వాలి. జంక్ ఫుడ్‌కి వీలైనంత దూరంగా ఉంచాలి. వ్యాయామం, ఆటల ద్వారా వారి బరువు అతిగా పెరగకుండా చూడాలి. ఈ రోజుల్లో మారుతున్న జీవన శైలి వలన చిన్న పిల్లలు కూడా డయాబెటిస్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. శరీర శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి నేర్పించాలి. వయసుతో పాటు శరీరంలో వచ్చే మార్పులను అర్థం చేసుకుంటూ దానికి తగినట్లు ప్రవర్తించేలా చూడాలి. వస్త్రధారణ, ఆహార నియమాలు, మంచి అలవాట్లు, క్రైస్తవ విలువలు, మర్యాదలు, శరీర దృఢత్వం (ఫిట్‌నెస్) కాపాడుకోవటం మొదలైన విషయాలన్నింటిని నేర్పించాలి.

**మానసిక ఎదుగుదల:**

భౌతిక ఎదుగుదలతో పాటు పిల్లల మానసిక వికాసానికి పునాది వేయవలసింది తల్లిదండ్రులే. మన ఇ.యు. విద్యార్థులలో గ్రామీణ ప్రాంతాలనుండి లేదా చిన్న పట్టణాలనుండి వచ్చిన వారే ఎక్కువగా ఉంటారు. వీరిలో కొందరు తల్లిదండ్రులైనపుడు, చిన్నప్పుడు తాము పెరిగినట్లే తమ పిల్లలు పెరగాలని, తాము నేర్చుకొన్నవే వారు కూడా నేర్చుకోవాలని కోరుకొంటుంటారు. వయసుకు తగినట్లు మానసిక అభివృద్ధి లేకపోతే బయటకు వెళ్ళినపుడు ఇతరులతో కలవడం, పోటీ ప్రపంచంలో నెగ్గలేక ఒత్తిడికి లోనవుతుంటారు. బైబిల్ ప్రకారం శిక్షణ చేయుట *(Chanokh - Hb)* అనగా 'ఒక బిడ్డను దేవునికి సమర్పించి, ఆ బిడ్డ దేవుని మందిరంలో, దేవుని సంబంధమైన విషయాలలో సంతోషించునట్లు పెంచుట' అని అర్థం.

వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన పాత్ర క్రమశిక్షణదే. క్రమశిక్షణ అనగా 'ఆత్మ నిగ్రహము, శీలము, క్రమము, దక్షత పెరిగేలా శిక్షణనివ్వటం'. పిల్లలు 'తల్లిదండ్రులను గౌరవిస్తూ విధేయత చూపించేలా నియంత్రించటం' అనే అర్థంతో కూడ ఉపయోగిస్తారు (నిర్గ 20:12; ఎఫె 6:1,2). పిల్లల క్రమ శిక్షణకు తల్లిదండ్రులే ముఖ్య బాధ్యులు (1 సమూ 3:13,14). ప్రతి బిడ్డలోను పాప స్వభావం ఉంటుంది (కీర్త 51:5; సామె 22:15) కాబట్టి వారి స్వచిత్తాన్ని తీసివేయడానికి (సామె 19:18) క్రమశిక్షణ అవసరం. క్రమ శిక్షణ చేయకపోతే తర్వాత నలుగురిలో అవమానం వస్తుంది (సామె 29:15). పిల్లలను క్రమ శిక్షణ చేయడం నిజమైన ప్రేమకు నిదర్శనం (సామె 13:24). విలువలతో కూడిన మంచి పుస్తకాలు, గొప్ప వారి జీవిత చరిత్రలు చదవడం మానసిక వికాసానికి దోహదపడుతుంది, జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల పిల్లలలో కలుగుతుంది. 5 సంవత్సరాల వరకు మానవ మెదడు ఎదుగుతూ ఉంటుంది కాబట్టి, ఆ వయసులో వారికి క్రొత్త విషయాలు నేర్చుకొనే సామర్థ్యం ఎంతో ఎక్కువగా ఉంటుంది. అంతేకాక ఈ వయసులోని పిల్లలు అన్నింటిని పరిశోధించాలనే (explore) ఆసక్తితో ఉంటారు. 5 సంవత్సరాల లోపు నేర్చుకున్న వాటిలో అధిక భాగం వారు పెద్దయ్యాక కూడ మరచిపోరన్నది శాస్త్రీయంగా ఋజువైన సత్యం.

**ఆధ్యాత్మిక ఎదుగుదల:**

చాలా చిన్న వయస్సునుండే (నెలలు) పిల్లలకు దేవుని విషయాలు బోధించాలి (వారికి అర్థమైనా కాకున్నా). యోకెబెదు మోషేను (నిర్గమ 2; హెబ్రీ 11), హన్నా సమూయేలును (1 సమూ 1), లోయి మరియు యునీకేలు తిమోతిని (2 తిమో 1:5) పెంచినట్లు చిన్నప్పటి నుండే మన బిడ్డలను విశ్వాసంతోను, దేవునియందు భయభక్తులతో పెంచాలి. పిల్లలు ఆ విధంగా ఎదగాలంటే క్రమమైన కుటుంబ ప్రార్థన కలిగియుండి, వారు పాల్గొనేలా చూడాలి. ఇంట్లో దేవుని ప్రేమను వారు రుచి చూడాలి. పరిసరాలను దేవుని వాక్యంతో నింపాలి (ద్వితీ 6:8-9). బైబిల్ కథలను చెప్పడం, వారితో కలసి నటించడం, యాక్షన్ సాంగ్స్ నేర్పడం, పిల్లలతో తమ ఆత్మీయ అనుభవాలు పంచుకోవడం ద్వారా వారిలో విశ్వాస బీజాలను వేయాలి. వాక్యాన్ని విశ్వసించే సంఘం, సండే స్కూల్, క్రైస్తవ సాహిత్యం, సంగీతం, సహవాసం, కార్యక్రమాలు మొదలైనవి వారు విశ్వాసంలో బలపడడానికి దోహదం చేస్తాయి. అన్నింటికీ మించి గృహము క్రైస్తవ విలువలను ప్రసారం చేయాలి (సామె 1:8; 2 తిమో 1:5; ద్వితీ 11:18-21). పిల్లలను వాక్యం చదవడానికి, ప్రార్థన చేయడానికి ప్రోత్సహించాలి. పిల్లలు ఎదుగుతున్న కొద్దీ వారి వయసుకు తగినట్లు సహాయకర పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. మా పిల్లల ఆధ్యాత్మిక ఎదుగుదలలో, మాతోపాటు సండే స్కూల్, Scripture Union books, ఇ.యు. బైబిల్ స్టడీస్, క్యాంపులు ప్రముఖ పాత్ర పోషించాయి.

**పిల్లల కొరకు ప్రార్థించి, వారిని సిద్ధపరచి, క్రీస్తుకు సమర్పించటమే గొప్ప ప్రేమ**

**సాంఘిక ఎదుగుదల:**

దేవుని ప్రేమించుట, పొరుగు వానిని ప్రేమించుట అనే రెండు గొప్ప ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికీ ఆధారమని యేసు ప్రభువు చెప్పిన సంగతి మనందరికీ తెలిసినదే (మత్త 22:37-40). ఈ విషయంలో లోకానికి ఉప్పుగా, వెలుగుగా (మత్త 5:13,14), క్రీస్తు సువాసనగా (2 కొరిం 2:15,16) ఉంటూ తల్లిదండ్రులు మాదిరి చూపించాలి. ఎందుకంటే తల్లిదండ్రులను గమనించడంద్వారా పిల్లలు నేర్చుకుంటారు కాబట్టి మంచి మాదిరితో జీవించాలి. దేవుని నాయకత్వంలో, గృహం పిల్లలను స్వాగతించేది, రక్షణ మరియు భద్రతనిచ్చేదిగా ఉండాలి (కీర్త 46:1). పిల్లలు తమ్మును తాము అంగీకరించేందుకు (self acceptance), జీవితంలో సరియైన ప్రాధాన్యతలు కలిగి ఉండేలా ప్రోత్సహించాలి. ప్రతి విషయంలో దేవునిపై ఆధారపడి సరైన నిర్ణయాలు తీసుకొనేందుకు మార్గ నిర్దేశం చేయాలి. అప్పుడు పెద్దవారయ్యాక కెరీర్, వివాహము, పరిచర్యకు సంబంధించిన నిర్ణయాలు చేయడంలోను, రాజీపడని క్రైస్తవ విలువలతో పని చేయడంలోను సఫలీకృతులవుతారు.

**పిల్లల విశ్వాసము, ప్రవర్తన లేఖనాల సంపూర్ణ అధికారం క్రింద ఉండేలా చూడాలి ఆడపిల్లల రక్షణ విషయంలో తీసుకోవలసిన ప్రత్యేక జాగ్రత్తలు:**

పసి పిల్లల నుండి పండు ముసలి వారి వరకు ఆడ వారిపై జరుగుతున్న అత్యాచారాల గురించి వింటున్నపుడు ఒళ్ళు గగుర్పొడుస్తుంది. పేపర్ తెరవాలంటే భయం – ఎలాంటి వార్తలు వినాల్సి వస్తుందోనని. ఆరు నెలల పసి పాపపై అత్యాచారం, కన్న కూతురిపై అత్యాచారం చేసిన తండ్రి, మైనర్ బాలికను మాదక ద్రవ్యాలకు బానిసను చేసి లైంగిక కోర్కెలు తీర్చుకొంటున్నవారు, డబ్బు కోసం కన్న కూతురితో, కట్టుకొన్న భార్యతో వ్యభిచారం చేయిస్తున్న వారు, ఇలా అనేక రకాలుగా స్త్రీలను వేధిస్తున్నారు. ఇంటా బయట భద్రత లేని పరిస్థితి. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియదు. ఎటునుండి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే. ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా మానవ హృదయంలో మార్పు రానంత

వరకు అమ్మాయిలకు అన్నిచోట్లా కష్టాలే.

యుగాలుగా, తరాలుగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలే ఇవి. బైబిల్‌లో నుండి కొన్ని ఉదాహరణలు చూద్దాం. విశ్వాసులకు తండ్రియైన అబ్రాము తన భార్య అందం కారణంగా, ఐగుప్తీయులనుండి తనకు ప్రాణహాని కలుగుతుందని భయపడి, శారయిని తన సహోదరి అని చెప్పమంటాడు (ఆది 34:11-13), తద్వారా ఆమె ప్రమాదపు అంచుల వరకు వెళ్ళి దేవుని దయ వలన బయటపడింది. తన ఇంటికి వచ్చిన అతిథులపట్ల అపచారము జరగకుండా ఆపడానికి, సొదొమ ప్రజల దగ్గరకు తన కుమార్తెలను పంపడానికి సిద్ధపడ్డాడు (ఆది 19:8) లోతు. దావీదు కుమారులలో ఒకడైన అమ్నోను, మోసపూరితంగా తన తండ్రి సహాయంతోనే, సహోదరియైన తామారును తన ఇంటికి పిలిపించుకొని అత్యాచారం చేసాడు (2 సమూ 13:6-15). యాజకుడైన ఏలీ కుమారుల సంగతి చెప్పనవసరం లేదు. పరమ దుర్మార్గులే కాక, ప్రత్యక్షపు గుడారము యొక్క ద్వారము దగ్గరకు సేవ చేయుటకు వచ్చిన స్త్రీలతో శయనించేవారు (1 సమూ 2:22). ఇకపోతే యాకోబు కుమార్తె దీనా, షెకెము దేశపు కుమార్తెలను చూడాలని అత్యుత్సాహంతో వెళ్ళి, రాజకుమారుని కంటబడి అవమానించబడింది, ఆ తర్వాత జరిగిన వాటికి హేతువైంది (ఆది 34:1-26). కారణం ఏదైనా, ఎవరైనా వీరందరూ బాధపడినవారే.

ఈ పరిస్థితులనుండి మన ఆడబిడ్డలను కాపాడుకోలేమా? ఆరుగురు చెల్లెళ్ళకు అక్కగా, ఇద్దరు కుమార్తెల తల్లిగా, బాలికల కళాశాలలో లెక్చరర్‌గా నాకున్న అనుభవాలనుండి కొన్ని సలహాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

1. మొట్ట మొదటిదిగా మన ఆడబిడ్డల రక్షణ దేవుని చేతిలోనే ఉంది కాబట్టి వారికొరకు ప్రత్యేకంగా ప్రార్థించాలి.

2. వారితో ఎక్కువ సమయాన్ని గడుపుతూ, ఒక మంచి స్నేహితు(డు)రాలుగా ఉండాలి. అప్పుడు అన్ని విషయాలు అరమరికలు లేకుండా పంచుకుంటారు.

3. స్పర్శగురించి బోధించి మంచి, చెడు స్పర్శల మధ్య తేడా వారు గుర్తించగలిగేలా చేయాలి.

4. వయసుతో శరీరంలో వచ్చే మార్పుల గురించి, హార్మోనుల ప్రభావం గురించి తెలియజేసి, ఆ పరిస్థితులను అంగీకరించటానికి సిద్ధపరచాలి.

5. Opposite sex పట్ల సహజంగా కలిగే ఆకర్షణ గురించి, దానిని ఎలా నిర్వహించాలో (handle) చెప్పాలి. దానికి సంబంధించిన మంచి పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. లేదంటే తప్పుడు లేక ప్రమాదకరమైన సమాచారం స్నేహితులనుండి, ఇంటర్నెట్ నుండి తెలుసుకొంటారు. ఇలాంటి సందర్భాలలోనే పోర్నోగ్రఫీకి అలవాటు పడతారు.

6. ఆత్మ గౌరవంతో (Self-esteem) ధైర్యంగా ఉండటం, opposite gender తో సత్సంబంధాలను ఎలా కలిగి ఉండాలో చెప్పాలి. ఆత్మ రక్షణ విద్యలను నేర్పించాలి. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధులను చేయాలి.

7. జీవిత సత్యాలను బోధించాలి. ప్రవర్తనా నియమావళిని ఏర్పరచి, దానిని పాటించేలా చిన్నప్పటినుండి అలవాటు చేయాలి. కొన్ని సందర్భాలలో అవసరమైతే తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాలి. ముఖ్యంగా రాత్రి పూట పార్టీలు, దూర ప్రదేశాలకు పిక్‌నిక్‌లు మొదలైనవి. పర్మిషన్ ఇచ్చేముందు అన్ని విషయాలు కనుక్కోవాలి.

ఇవన్నీ చేయాలంటే తల్లిదండ్రులుగా మనం తెలుసుకోవలసిన, నేర్చుకోవలసిన కొన్ని విషయాలు

- పిల్లలకు సంబంధించిన అన్నింటిలో కనీస అవగాహన
- ప్రస్తుత పోకడలు, టెక్నాలజీని ఉపయోగించడం
- పిల్లల స్నేహితులతో, టీచర్లతో సత్సంబంధాలు కలిగి ఉండడం

ఇకపోతే అమ్మాయిలకు - బయటకు వెళ్ళినపుడు పరధ్యానంగా కాక అప్రమత్తంగా ఉండి, పరిసరాలను గమనించుకుంటూ ఉండాలి. అపరిచిత వ్యక్తులతో మాట్లాడకపోవటం మంచిది. క్రొత్త ప్రదేశాలకు వెళ్ళినపుడు ఇంట్లోని వారితో తరచూ మాట్లాడుతూ, live location share చేయాలి. Phone లో ICE (In Case of Emergency) పేరుతో number save చేసుకొని shortcut పెట్టుకోవాలి. ఇంకా అవసరమైన పోలీసు, మహిళల రక్షణకు సంబంధించిన నంబర్లు కూడా save చేసుకోవాలి. స్వీయ రక్షణకు hand bag లో pepper spray, కారం లాంటివి పెట్టుకోవడం మంచిది. పెద్దవారు చెప్పినదే మరల మరల చెబుతుంటే అది మీపట్ల వారికున్న ప్రేమ అని గ్రహించి వారి మాటలను పెడచెవిని పెట్టకండి. భయపడకుండా, తెలివిగా ప్రమాదాల బారిన పడకుండా మిమ్మల్ని మీరు రక్షించుకొనేందుకు సిద్ధపడి ఉండండి.

**బిడ్డలను పెంచడం బాధ్యత మాత్రమే కాదు గానీ దేవుడిచ్చిన గొప్ప ఆధిక్యతని గుర్తించి, మన పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుదాం. ప్రత్యేకించి మన ఆడపడుచులను ధైర్యవంతులుగా పెంచి సంరక్షించుకుందాం.**

**- సహోదరి.వి. గౌరి కుమారి,** రిటైర్డ్ లెక్చరర్, తెనాలి.

(వీరు ప్రస్తుతం యు.ఇ.యస్.ఐ. నేషనల్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.)



# కనుల ముందున్నా కనిపించని సవాళ్ళు

చాలా తర్వాగా క్యాలెండర్‌లోని పేజీలన్నీ తరిగిపోయాయి. సంవత్సరం త్వరగా అయిపోయినట్లుంది సృజన్‌కి. రోజూ క్వయిట్ టైం చేసుకోవడానికి కూడా తీరిక లేని ఆఫీసు పనులు. ఏ బైబిల్ స్టడీనో లేదా ఏదైనా టాక్ తీసికోవలసి ఉంటేనే కాస్త టైం తీసుకొని ప్రిపేర్ అవుతాడు. ఈ సంవత్సరం అలా జరిగిపోయింది. క్వయిట్ టైం చేసుకోవడానికి కాస్త ఈజీగా ఉంటుందని అసలే తనకు టైం కూడా సరిపోవట్లేదని 'లూకా' సువార్తను ఎంచుకున్నాడు. బైబిల్ చదవకపోతే దేవుడేమయినా ఫీల్ అవుతాడేమోనని మొక్కుబడిగా, బలవంతంగా చదివిన రోజులు కూడా ఉన్నాయి. తమ్ముడూ! బైబిల్ చదువుతున్నావా? అని స్టూడెంట్స్‌ను పరామర్శించడానికి ముందు బైబిల్ చదువుకొని వచ్చిన రోజులు కూడా లేకపోలేదు.

అసలు విషయం ఏందంటే ఈరోజు క్వయిట్ టైంలో (లూకా 10వ అధ్యాయం) దేవుడు తనకు గుర్తు చేసిన, చేస్తున్న విషయాల గురించి ఆలోచిస్తున్నాడు సృజన్. "ఎవరు నీ పొరుగువాడు? దేవుడు పదే పదే తనను ప్రశ్నిస్తున్నట్లుంది. అతని మీద జాలిపడిన వాడే" అనే సమాధానం మనస్సును తొలిచేస్తుంది. పొరుగువాడు అనే పదం ఎందుకు తననింతగా కదిలిస్తుంది. నిన్ను వలె నీ పొరుగువాన్ని ప్రేమించు అనే ఆజ్ఞ నేను పాటిస్తున్నానా? నాలాగా నా పొరుగువారిని ప్రేమించట్లేదే? ఆజ్ఞాతిక్రమం అంటే పాపమే కదా! అంటే నేను నాకు తెలియకుండానే పాపం చేస్తున్నానా? "వాక్యానికి దూరమైన వారు పాపానికి చేరువైనవారు" అని ఏ బైబిల్ స్టడీలోనో ఇఐయఫ్‌లోనో విన్నట్టు గుర్తొచ్చింది సృజన్‌కి. నిజంగానే ఈ సంవత్సరమంతా ఏమంతా బాగా బైబిల్ చదవడం, ధ్యానించడము చేయలేదని ఒప్పుకున్నాడు మనస్సులో.

ఈరోజు చదివిన వాక్యభాగమెందుకో మళ్ళీ మళ్ళీ చాలా సార్లు గుర్తుకు వస్తుంది మరి! ఎవరు నా పొరుగువారు? నా స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు, నా కొలీగ్స్ వీళ్ళంతా నా పొరుగువారే గదా! వీరందరిపైనా నేనెప్పుడు జాలిపడలేదే! దేవుడెవరో తెలియకుండానే వారు చనిపోతూ నరకానికి వెళ్తుంటే నాకు జాలి కలగట్లేదా? చేయదగిన సాయం చేసే సామర్థ్యం నాకున్నా దాన్ని పొందదగిన వారికి ఇవ్వకుండా ఉంటున్నానా? ఇలా మనస్సులో పరి పరి విధాలుగా ఆలోచిస్తూ సృజన్ ప్రశాంతతను కోల్పోయాడు.

'పొరుగువాడు' అన్న విషయం మామూలు విషయం కాదు. ప్రతి విశ్వాసికి అదెంతో భారంతో, బాధ్యతతో కూడుకున్న పదం. గత రెండు రోజుల నుండి ఈ ఆలోచనలు సృజన్‌ని మరింత లోతైన ధ్యానానికి నడిపిస్తున్నాయి. ఈ సంవత్సరములో దేవుడు ఈ విషయాన్ని పదే పదే బోధిస్తున్నాడు. అసలు ఈ సంవత్సరమంతా ఎలా గడిచిందో ఒకసారి మననం చేసుకొన్నాడు సృజన్. ఆ రోజు అంటే 31వ డిసెంబర్ వాచ్‌నైట్ సర్వీసులో తనకొచ్చిన వాగ్దానం చూసుకొని మురిసి పోయాడేగాని, దేవుని సన్నిధిలో తాను చేసిన వాగ్దానాలు మరిచిపోయాడు.

ఈ సంవత్సరమంతా ఎన్నెన్ని విషయాలు జరిగాయి. రోజుకెన్నెన్ని సంఘటనలు జరుగుతున్నాయి. వావి వరసలు లేని లైంగిక సంబంధాలు, డబ్బాశ చూపించి చిన్న బాలికలను సైతం వ్యభిచార కూపంలోకి లాగడం, పసికూనలను కూడా వదలని పశుతత్వం మొన్న నిర్భయ... నిన్న దిశ ఇలా దశ దిశలా మానవ మృగాల బారిన పడి బలిఅవుతున్న వారందరూ నా అక్క చెల్లెళ్ళ సమానం కాదా? నేను, నా ఇంట్లోని ఆడవాళ్ళు బాగుంటే చాలు అనే భావన నా మనస్సులో దాగుందా? ఇలాంటి విషయాలు విన్నప్పుడు, చదివినప్పుడు నామనసు చలించదెందుకూ? అయ్యో, అంత పని జరిగిందా? అనే డైలాగ్‌తో అందరి లాగే సరిపెట్టుకుంటున్నానా? భారంతో కూడిన కన్నీటి ప్రార్థన నాకు రావట్లేదే? "యేసు క్రీస్తుకు కల్గిన మనస్సును మీరును కలిగి ఉండుడి" అనే వాక్యం కేవలం నా ప్రసంగాలకే పరిమితమా?

యేసుక్రీస్తు మార్తా మరియలు తమ తమ్ముడి రోసం ఏడుస్తుంటే యేసుక్రీస్తు వారితో కలసి కన్నీళ్ళు విడిచాడు. సిలువలో బాధను భరిస్తూ కూడా తన కోసం ఏడుస్తున్న స్త్రీలను చూసి "అమ్మాలారా నాకోసం ఏడ్వకుడి, మీ కోసం మీ పిల్లల కోసం ఏడవండి" అన్నాడు. తన తల్లి బాధ్యతను అలా వదిలేసి వెళ్ళకుండా యోహానుకు అప్పగించాడు. స్త్రీల పట్ల ఆయనకు ఎంత గౌరవం, ఎంతటి శ్రద్ధ, వారిని 'అమ్మా' అని సంబోధించిన సందర్భాలు గుర్తుకొచ్చాయి సృజన్‌కు. మనస్సు బాధగా మూలిగింది.

తన ఇంట్లోని తల్లి, అక్క చెల్లెళ్ళ పట్ల తను చూపే నిర్లక్ష్య వైఖరి గుర్తొచ్చింది. బయట స్త్రీల పట్ల తన చులకన

భావం, పురుషాహంకారం కూడా గుర్తొచ్చింది. పరిశుద్ధాత్మ దేవుడు ప్రతి యొక్క పాపాన్ని క్షుణ్ణంగా చూపిస్తున్నాడు.

నేటి సంఘాల్లో ఎంతో నులివెచ్చని తనం, సార్వత్రిక సంఘం ఎదుర్కొనే సమస్యల్లో ఇది గడ్డు సమస్య. తప్పుడు బోధలు, ప్రాస్పెరిటీ గాస్పల్‌ను బోధించడం వల్ల సంఘస్తుల్లో సన్నగిల్లుతున్న విశ్వాసం. ధనసంపాదన, పేరు, ప్రఖ్యాతులకోసం "స్వస్థతలంటూ" బూటకపు స్వస్థతలను ప్రదర్శిస్తూ ప్రజలను సులువుగా తమ వల్లో వేసుకొంటున్న ఫాదరీలు, పాస్టర్లు ఒకవైపు.

కావలికోట, తేజరిల్లు అనే పుస్తకాలను ప్రచురిస్తూ వాటిని చాలా నేర్పుగా విశ్వాసులకు అందిస్తూ తప్పు దారి పట్టిస్తున్న యెహోవా సాక్షుల గుంపు మరో వైపు. దేవుడు తన పరిశుద్ధ రక్తాన్ని కార్చి కొన్నట్టి సంఘాల్లో పరిశుద్ధత కరువై యువ్వనస్థుల మధ్య ఆడ, మగ తేడా లేకుండా సినిమా డ్యాన్సులను తలపించే కొరియోగ్రఫీలు, యూత్ మీటింగ్‌లంటూ తరుచూ చాటింగులు, మీటింగులు మరోవైపు.

చర్చి ఆస్తుల కోసం, అధికారం కోసం సంఘ పెద్దల–పాస్టర్ల తగాదాలు–కోర్టు కేసులు ఇలా క్రైస్తవ సమాజాలను పట్టి పీడిస్తున్న సమస్యలు ఎన్నో. ఇంకా దేశ పరిస్థితి చూద్దామంటే తాగునీటి సమస్య, బాల కార్మిక వ్యవస్థ, నిరుద్యోగం, పేదరికం, కాలుష్యం, పెడదారి పడుతున్న యువత, పెరిగిపోతున్న దౌర్జన్యం, లంచగొండితనం, వ్యాపారం పేరిట దోపిడి, మోసం, నచ్చని మనష్యులను ఎక్కడికక్కడ విచక్షణారహితంగా నరికివేసే క్రూరత్వం ఇలాఎన్నో... ఎన్నెన్నో సమస్యలు...

ఇక ఇ.యు పరిచర్య కొస్తే హడావిడి ప్లానులు, కొరవడిన ప్రార్థనలు, పట్టికలకు పరిమితమైన కోర్‌వ్యాల్యుస్... స్టూడెంట్స్‌పై వ్యక్తిగత శ్రద్ధ లేకపోవడం, సరిగా జరగని ఫాలోఅప్‌లు... లెక్కలకు పరిమితమైన ఇ.సిలు. ఈ సమస్యలన్నిటికీ నేనూ బాధ్యుడనే అనుకున్నాడు. దేవుడిచ్చిన వనరులను, తలాంతులను సరిగా ఉపయోగించక పోవడము దేవుని పనిపై అశ్రద్ధ వాక్యరహిత జీవితం...

ఇలా సమాజంల్లోను, సంఘములోను, ఇ.యు పరిచర్యలోను ఉన్న సమస్యలను దేవుడు చూపిస్తూ ఎవరు నీ పొరుగువాడు అని ప్రశ్నిస్తున్నాడు. జాలి చూపించడం మాత్రమే గాక శ్రద్ధ చూపించమని ఆజ్ఞాపిస్తున్నాడు. రాబోయే సంవత్సరంలో కళ్ళముందు కనిపించే సమస్యలే ఎదుర్కోవాల్సిన కొత్త సవాళ్ళుగా ఎదురుగా నిలిచాయి. పాడవుతున్న సమాజం కోసం కన్నీళ్ళు విడిచి ప్రార్థించిన యిర్మీయా కనుల ముందు కదలాడాదు సృజన్‌కి. **–సహోదరి. శ్యామాలా కృపారావు**

ఎ.జి.జోన్

# కళ్ళకు కళ్ళెం

**2019 లో ఓ యవ్వన క్రైస్తవుడు...**

పాడు చూపులతో నేను వారిలా ప్రతి రోజు చూడట్లేదు కదా!

ఓ రొమాంటిక్ లుక్ వేయడంలో తప్పేముంది? అని అనుకునేవాడట.

అంతే కాదు 'నీలి నీడలు' చూడడమే తప్పు, అప్పుడప్పుడు 'ఎ' గ్రేడ్ సాంగ్స్ చూడడం తప్పు కాదు అనుకునేవాడట!!

ఈ మధ్య వాడి మట్టి బుర్రకు అలాంటివి అన్నీ తప్పే అని అనిపిస్తున్నాయట!

అంతే కాదండోయ్ మోహపు చూపుల పాపాన్ని జయించాలన్న కోరిక, చూపులు పవిత్రంగా ఉండాలన్న వాంఛ బలపడుతున్నాయట!

అదంతా ఆ పరిశుద్ధాత్ముడి పని కాబోలూ, ఆత్మానుసారమైన మనిషికే అలాంటి వాంఛలు కదా!

హలో పెళ్ళికాని యువత!... నిన్నే

మన కళ్ళు వందలాది మందితో పెళ్ళికి ముందే పాపం చేయించగలవు జాగ్రత్త!

శరీరానుసారమైన మనస్సు ఎప్పుడు ఆత్మానుసాకమైన మనస్సుకు విరోధమని నీకు తెలుసుగా!

మన బుద్ధి మాట వినదు అని రోజు 'పాపం గడ్డి' తిందామా? ఒక సారి మన క్యాంప్స్, కాన్ఫరెన్స్ దినాలను గుర్తుచేసుకుందాం...!

ఆ గడ్డి తినని రోజులు, వారాలు నీ ఖాతాలో లేవా? ఎలా సాధ్యమైంది? నీలోని ఆత్మానుసారమైన మనస్సు వల్లా, పరిశుద్ధాత్ముడి సాయంతోనే.

మరి నీ ఖాతాలో పాప రహిత నెలలు, సంవత్సరాలు ఆ దేవుడు జమచేయలేదా? నీవు సహకరిస్తే కచ్చితంగా చేయగలడు!!

"నా ఖాతాలో అలాంటి నెలలు వున్నాయ్" అని అందరి ముందూ నిలిచి ఆ అన్న చెప్పాడు అని నేను విన్నప్పుడు నాపై నాకు జాలివేసింది.

తేడా చూపులకే గొల్లెమెట్టకపోతే

పాడు తలంపులకు కళ్ళెం ఎట్లా వేస్తావ్?

కాస్త ఆలోచించు సోదరా!

దేహమంతటికి దీపమైన కన్నులను చిన్న చూపు చూస్తే ఎలా!

కళ్ళతో నిబంధన, వయస్సులో ఉపవాసం అనేవి పాడు చూపులను అరికట్టడానికి చక్కటి పరిష్కార మార్గాలట!

చివరిగా ఓ విషయం

మన పట్టుదలతో, ప్రణాళికలతో

"పరిశుద్ధ చూపులు" అసాధ్యమే కానీ

పరిశుద్ధుని సాయంతో అది సాధ్యమే!!

– సహో.ఎల్లన్న, హెచ్.సి.యు జోన్.

# వి.యస్.అజరయ్య-భారతదేశంలో ఆంగ్లికన్ చర్చ్ తొలి బిషప్



మొదటి శతాబ్దములోనే యేసు క్రీస్తు శిష్యులలో ఒకరైన తోమా భారతదేశంలో సువార్తను ప్రకటించారు. ఆ తరువాత అనేక దేశాలకు సంబంధించిన సంఘాల వారు మిషనరీలను పంపించారు. 17వ శతాబ్దంలో బ్రిటిష్ దేశానికి చెందిన ఆంగ్లికన్ చర్చ్ మిషనరీలు మన దేశానికి వచ్చారు.

సెయింట్ పాల్స్ కెథడ్రిల్, కలకత్తా నగరం. డిసెంబర్ 12, 1912వ సంవత్సరం. అక్కడ అంతా ఉత్సవ వాతావరణం నిండి ఉంది. భారతదేశం అంతా కలిసి ఆ కెథడ్రిల్‌కే వచ్చిందా అన్నట్లుగా అన్ని రాష్ట్రాల ప్రజలు అక్కడ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దానికి కారణం దైవజనుడైన ఒక వక్తి. ఆయన క్రైస్తవ ఐక్యతకు ప్రతీక, సువార్త పరిచర్యకు అపోస్తలుడు. అరణ్యంలా ఉన్న భారతదేశ క్రైస్తవ సంఘానికి మొట్ట మొదటి బిషప్‌గా ఆంగ్లికన్ సంఘముచే అభిషేకం చేయబడిన బిషప్ వేద నాయగం శామ్యూల్ అజరయ్య.

**బాల్యం, విద్యాభ్యాసం:**

అజరయ్య కన్యాకుమారికి దగ్గరగా ఉన్న వెల్లనవిలాయ్ అను గ్రామంలో జన్మించాడు. అతని తండ్రి పంటగింజలను అమ్మేవాడు. ఆయన తన చిన్నతనంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి సత్యాన్వేషణలో సిఎంఎస్ (చర్చ్ మిషనరీ సొసైటీ) నకు సంబంధించిన మిషనరీల వద్దకు వెళ్ళాడు. 1839లో బాప్తీస్మం తీసుకొని థామస్ వేదనాయగం అనే పేరుతో పిలువబడ్డాడు. 1869లో డీకన్‌గా ఉంటూ సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు. ఆయనకు 13 ఏళ్ళ నిరీక్షణ తరువాత ఆగష్టు 17, 1874లో మగపిల్లవాడు జన్మించాడు. అతనికి శామ్యూల్ అజరయ్య అని నామకరణం చేసాడు. అతడు చిన్నప్పటి నుండి చదువులో, బైబిల్ జ్ఞానంలో ఎంతో ఆసక్తిని కలిగి ఉండేవాడు. అతడు ప్రార్థనాపరులైన తన తల్లిదండ్రులను, గురువులను ఎంతగానో అభిమానించేవాడు.

1885, జనవరి 1న ఆయన తిరునల్వేలిలోని మైజ్ఞానపురం అనే ప్రదేశంలో సిఎంఎస్ బోర్డింగ్ స్కూల్ నందు చేరారు. ఆ తరువాత కాలేజి విద్యను మధ్యలో విడిచి పాలాయనకోటంలోని సిఎంఎస్ హైస్కూల్‌లో టీచరుగా కొంతకాలం పని చేసారు. ఉన్నత విద్యకై మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో చేరారు. అక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ విలియం ముల్లర్ అజరయ్యను ఎంతో ప్రభావితం చేసారు. కాని ఇన్ఫ్లుఎంజా రావడం వలన బిఎ ఆఖరి సంవత్సరం పరీక్షలను రాయలేకపోయాడు. ఆర్థిక ఇబ్బందుల వలన ఆయన యూనివర్సిటీ విద్యను కొనసాగించలేకపోయారు.

**ఉద్యోగం, వివాహం:**

అజరయ్య 14 సంవత్సరాలు వైఎంసిఎ నందు పనిచేశారు. అక్కడ ఆయనకు జాన్.ఆర్.మోట్, జార్జ్ షేర్‌ఉడ్ ఎడ్డీ, రాబర్ట్ విల్డర్ మరియు జి.ఉల్డ్ హామ్ అను వారు మిషన్స్ పట్ల ఆసక్తిని కలిగించారు. వారు స్టూడెంట్ వాలంటీర్ మూమెంట్‌ను ప్రారంభించారు. ఈ తరములోని ప్రపంచాన్ని సౌవార్తీకరించడమే దాని ప్రధాన లక్ష్యం. జూన్ 29, 1898న అజరయ్య అంబు మణియమ్మాల్‌ను పరిశుద్ధ వివాహం చేసుకున్నారు. ఆమె కూడా తిరునల్వేలికి చెందిన మిషనరీ మనస్సు కలిగి దైవజ్ఞానంతో నిండిన స్త్రీ. ఆమె తన భర్తను ప్రోత్సహిస్తూ సాటియైన సహకారిగా ఉండేది.

వారికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలను సంతానంగా దేవుడు అనుగ్రహించాడు.

**ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో పరిచర్య:**

1836 వ సంవత్సరంలో మద్రాసుకు చెందిన బిషప్ కోరి ఆంధ్రప్రదేశ్‌ను దర్శించారు. అక్కడ కేవలము నలుగురు భారతీయ క్రైస్తవులు మాత్రమే నిర్ధారణకు సిద్దంగా ఉన్నారు. 1837లో కృష్ణా జిల్లా కలెక్టరుగా పనిచేసిన దైవభక్తి గల గోల్డింగ్ హామ్ ఈ విధంగా తెలియచేసారు. "ఆంగ్లికన్ చర్చికి చెందిన ఏ

ఒక్క సువార్తికుడు తెలుగు ప్రజలకు సువార్తను ప్రకటించుటకు గాని, కనీసం కరప్రతికలను వారి భాషలో ఇచ్చుటకు గాని ఇంతవరకు ఎవరూ రాలేదు". అనేక క్రైస్తవ మిషనరీ సంస్థలు దీని విషయమై ప్రార్థించాయి. 1835లో నెల్లూరు నందు అమెరికా బాప్టిస్ట్ మిషన్ వారిచే పరిచర్య ప్రారంభమయ్యింది. ఆ తరువాత దినాలలో బందిపోటు దొంగగా ఉన్న వెంకయ్య అనే వ్యక్తి మార్పు వలన క్రైస్తవ ఉద్యమం బలపడింది. 1901వ సంవత్సరానికంతా కృష్ణా జిల్లాలో 29,186 మంది క్రైస్తవులుగా మారారు. ఆ తరువాత జార్జ్ షేర్‌ఉడ్ మరియు ఎడ్డీ అనే మిషనరీలు భారతదేశమంతా తిరిగి సువార్త అందని అనేక ప్రదేశాలు ఇంకా ఉన్నాయని గుర్తించారు. వైయంసిఎ నందు వారి సహోద్యోగి అయిన అజరయ్యతో ఈ విషయాన్ని పంచుకున్నారు. భారతదేశాన్ని అంతా సువార్తతో సంధించాలనే ఆకాంక్ష యువకుడైన అజరయ్యలో కలిగింది. 1903లో తిరునల్వేలి ఇండియన్ మిషనరీ సొసైటీని కొందరు తమిళ క్రైస్తవ పరిచారకులతో కలిసి ప్రారంభించారు. అపొస్తలుడైన పౌలు వలె ఆయన సువార్త అనేక ప్రాంతాలలో, వేరొకరు పునాది వేయని స్థలాలలో మాత్రమే సువార్తను ప్రకటించాలని నిశ్చయించుకున్నారు. అప్పటికి సువార్త అందని ప్రాంతముగా ఉన్న డోర్నకల్‌ను వారు చేరుకున్నారు. ఆ దినాలలో అది హైదరాబాద్ నిజాంల పాలనలో వున్నది. 1905లో అజరయ్య మరియు అతని స్నేహితుడు కె.టి.పాల్ కలిసి నేషనల్ మిషనరీ సొసైటీని ప్రారంభించాడు. భారతదేశము మరియు పొరుగు దేశాలలోని సువార్త అందని ప్రదేశాలకు వెళ్ళి ప్రకటించుట దీని లక్ష్యం. ఇండియా ప్రజలు, ఇండియా డబ్బు మరియు ఇండియన్ల యొక్క మార్గదర్శకంలో ఇది పనిచేస్తుంది. 1995లో వారికి వాలంటరీగా వచ్చిన ధనము 2,000 రూపాయలు. అజరయ్య ఆయా ప్రదేశాలలో ప్రజలకు సువార్త అందించడమే కాకుండా అక్కడి ప్రజల అవసరాలను గుర్తెరిగి పనిచేయాలని సంకల్పించారు. అనేకమందిని మిషనరీలుగా వెళ్ళడానికి ఉత్తేజ పరిచిన పిమ్మట, నేనే ఆ ప్రదేశానికి ఎందుకు వెళ్ళకూడదు? అన్న ప్రశ్న ఆయన మనస్సులో దేవుని స్వరము అడుగుటచే దానికి లోబడి డోర్నకల్‌కు వచ్చుటకు సిద్ధపడ్డారు.

**మిషనరీ పరిచర్యలో అజరయ్య దంపతులు:**

శ్రీమతి అంబు అజరయ్య మిషనరీ పరిచర్య అంతటిలో ఎంతో సహకారం అందించింది. క్రొత్త ప్రదేశంలో ఇంటి వసతులు సరిగా లేకపోయినా, తగ్గింపు గల జీవితాన్ని ఎంతో ధైర్యంగా సంతోషంతో స్వీకరించింది. ఆమె తన తోటి పరిచారకులకు ఎన్నో విధాలుగా తోడ్పడేది. డోర్నకల్‌లో పాఠశాల మరియు బోర్డింగ్ స్కూల్ నెలకొల్పడంతో, స్త్రీలను పరిచర్యలో ప్రోత్సహించడంలో ఆమె కృషి మరువలేనిది. ఆమె తల్లులకు ప్రత్యేకంగా కరపత్రికలను ముద్రించి పంచిపెట్టేది. అజరయ్య కూడా అనేక రచనలను చేసారు. క్రైస్తవ దాతృత్వముపై ఆయన రాసిన పుస్తకము 50కి పైగా భాషలలోనికి అనువదించబడింది. బాప్తీస్మము, ప్రభురాత్రి భోజన సంస్కారము, ప్రకటన గ్రంథము యొక్క కామెంటరీ మొదలగు వాటిని ఆయన రచించారు. 1922లో డోర్నకల్ డయాసిస్‌గా ఏర్పడింది.

1915 లో డోర్నకల్ చర్చి కట్టడానికి పునాది వేయబడింది. 1938 లో నిర్మాణం పూర్తయ్యింది. ఆ కెథడ్రిల్ డిజైనింగ్ అంతా అజరయ్య స్వయంగా చేసారు. ఇటుక వెంబడి ఇటుక పేర్చుకుంటూ అది దేవుని ఆరాధనకు ఒక మహిమకరమైన ప్రదేశంగా కట్టబడుటలో అజరయ్య పాత్ర మరువలేనిది. జూన్ 1910 లో స్కాట్లాండ్‌లోని ఎడిన్బర్గ్‌లో ప్రపంచ మిషనరీ సదస్సు జరిగింది. దానిలో అనేక మంది ప్రముఖ మిషనరీలు పాల్గొన్నారు. అందులో తన స్వరం వినిపించే అవకాశం వచ్చింది అజరయ్యకు. విదేశీ మిషనరీలు మరియు వారి సహ ఉద్యోగుల మధ్య ఉన్న బలహీన సంబంధాలు, సాంఘిక అసమానతలను ఆయన తనదైన శైలిలో దృఢమైన స్వరంతో వినిపించాడు. ఈ ప్రసంగము ద్వారా భారతదేశ మిషనరీ ఉద్యమంలో అనేక మార్పులు రావడానికి నాంది పలికింది. ఆయనకున్న రెండు లక్ష్యాలు డోర్నకల్ కెథడ్రిల్ నిర్మాణం మరియు పిల్లల కొరకు వసతి గృహం. ఈ రెండు కూడా చక్కని నిర్మాణ శైలిలో హైదరాబాద్ నిజాం యొక్క అనుమతితో ఆయన నెరవేర్చారు.

**అజరయ్య విశిష్టతలు మరియు రచనలు:**

అజరయ్య ఆధ్వర్యంలో ఒక బలమైన సంఘం డోర్నకల్‌లో స్థాపించబడింది. దానిని ఆత్మీయంగా బలపరచుటలో ఆయన ఎనలేని కృషి చేసారు. సౌవార్తిక ప్రయత్నాలను కొనసాగించారు. నూతన ప్రదేశాలలో సువార్తను ప్రకటించారు. బాప్తీస్మము ఇవ్వడంలో కూడా ఆయన ఎంతో జాగ్రత్తగా సభ్యులకు హెచ్చరికలు ఇచ్చేవారు. ఆయన సంఘానికి 'ప్రతి క్రైస్తవుడు ఒక సాక్షి' ఆనే నినాదాన్ని ఇచ్చి 'సాక్ష్యపు వారాన్ని' పాటించాడు. అది నూతన వ్యక్తులకు సువార్త ప్రకటించడానికి ఒక చక్కని సృజనాత్మకమైన ఆలోచన. అపొస్తలుడైన పౌలు వలె సంఘంలో బలమైన పునాదులను వేయుటకు బిషప్ అజరయ్య పాటుబడ్డారు.

'ఈ తరంలో బైబిల్‌ను అధ్యయనం చేసే సంఘం' మరియు 'ప్రతి ఒక్కరూ ఒకనికి బోధించండి' వంటి నూతన పద్ధతులను ప్రవేశపెట్టి బైబిల్ అధ్యయనాన్ని ప్రోత్సహించాడు. ఆయన పాస్టర్లకు వేదాంత విద్యలో తర్ఫీదు చేయుటకు ప్రాముఖ్యత నిచ్చేవారు. పాస్టర్ల అవసరాలు తీర్చే బాధ్యత సంఘానిదే అని ఆయన భావించేవారు. గ్రామీణ జీవన విధానాన్ని అర్థం చేసుకొని వారికి బోధించాలని ఆయన పాస్టర్లకు తెలియజేసేవారు. వారి సమస్యలను అర్థం చేసుకొని సహాయం చేసేవారు.

బిషప్ అజరయ్య బైబిల్‌ను ఎంతో ప్రేమించేవారు. 'నా చిన్నతనంలో నా తల్లి ద్వారా నేను బైబిల్ జ్ఞానం సంపాదించుకున్నాను. బైబిల్ పట్ల ప్రేమను అది నాలో పెంపొందించింది' అని ఆయన చెప్పేవారు. సంఘ నాయకులకు సంవత్సరాంతంలో జరిగే రిఫ్రెషర్ కోర్సులో ఆయన బైబిల్ ఎక్స్‌పోజిషన్స్ ఇచ్చేవారు. అది ఎంతో సమగ్రమైన అధ్యయనంతో, వాస్తవ విషయాలతో ఆత్మీయాభివృద్ధికి తోడ్పడేది.

ఆయన చేసిన మిషనరీ పరిచర్యకు ప్రభావితురాలైన ఆయన కుమార్తె మెర్సీ మిషనరీగా సమర్పించుకొని మధ్య భారతదేశంలోని గోండుల మధ్య పరిచర్య చేయటకు తీర్మానం చేసుకొంది. అక్కడ ఆ పరిచర్య కొనసాగుటలో బిషప్ అజరయ్య ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారు. భారతదేశాన్ని క్రీస్తు కోసం గెలవాలన్న దీక్ష, బలమైన ఆకాంక్ష, పట్టుదల కలిగి ఉండేవాడు. ఆయనను 'క్రైస్తవ ఐక్యతకు అపొస్తలుడు' అని క్రైస్తవ నాయకులు సంబోధించేవారు. ఆయన సంఘాలలో ఐక్యతకు ఎంతో కృషి చేసారు.

ఆయన మంచి బోధకుడు. నమ్మకమైన బైబిల్ అధ్యాపకుడు. ఆయన అన్ని విషయాలు విని తెలుసుకోవడానికి ప్రయత్నించేవాడు. తన తీరిక లేని జీవితంలో కూడా ఒక పుస్తకం లేదా వ్యాసాన్ని రాయడం, అనువదించడం, ఉత్తరాలు రాయడం, ప్రత్యేక సందేశాలను తయారు చేయడం – ఇవి అన్నీ తన స్వంత చేవ్రాతతోనే చేసేవారు. ఆయన దస్తూరీ ఎంతో అందంగా ఉండేది. 180 కి పైగా పుస్తకాలు, వాస్యాలు, అనువాదాలు చేసారు. పాస్టర్లకు మరియు బోధనకు సహాయపడే రచనలు చేసారు. హోలీ బాప్టిసం, ది పాస్టర్ అండ్ ద పాస్టరేట్, లెసన్స్ అన్ మిరకల్స్, క్రిస్టియన్ గివింగ్, కన్ఫర్మేషన్, సబ్బాత్ అర్ సన్ డే మొదలగు పుస్తకాలను రాసారు. ఛార్లెస్.జి.ఫిన్నీ మరియు ఆండ్రూ ముర్రేల రచనలను అనువదించారు.

ఆయన ఎప్పుడు బీదలను ఉద్దరించాలని ఆశించేవారు. సామాజిక సంస్కరణలను సువార్త ద్వారానే సాధించగలమని, రక్షించుటకు దేవుని శక్తి ద్వారానే సాధ్యమని ఆయన విశ్వసించేవారు. యేసు క్రీస్తు సంఘాన్ని ప్రేమించి తనను తాను అర్పించుకొనిన విధంగా ఆయన సంఘాన్ని ప్రేమించి తన సర్వస్వం సంఘసేవలోనే సమర్పించారు. ఆయన తనకంటూ ఏమి మిగిల్చుకోలేదు.

**ముగింపు:**


ఆయన తన చివరి దినాలను గ్రామాలలో గడిపారు. అప్పటి పయనీరింగ్ ప్రాంతంగా ఉన్న పరకాలలో క్రిస్మస్ ప్రోగాంకు హాజరయ్యారు. బస్సులో 70 మైళ్ళు ప్రయాణం చేసి ఆ తరువాత ఎడ్లబండిలో ప్రయాణించి అక్కడకు చేరుకున్నారు. ప్రజలకు నిర్ధారణ ఇచ్చారు. అక్కడి గ్రామ ప్రజలు క్రీస్తు రెండవ రాకడను గూర్చి పాడిన పాటలు విని ఆనందించారు. స్వల్ప అనారోగ్యంతో ఆయన డోర్నకల్‌లోని తన గృహానికి తిరిగి వచ్చారు. అది తీవ్ర జ్వరంగా మారి అనారోగ్యానికి గురై 1945 జనవరి 1న ప్రభువు సన్నిధికి వెళ్ళారు. 32 సంవత్సరాలు బిషప్‌గా సుదీర్ఘమైన పరిచర్య చేసి తన తరంలో దేవుని కొరకు బలంగా వాడబడి ప్రభువు పనిని నమ్మకంగా చేసిన భారతదేశపు తొలి బిషప్‌గా, సమర్థుడైన సంఘ నాయకునిగా ఆయన ఖ్యాతి చిరకాలం క్రైస్తవ చరిత్రలో నిలిచివుంటుంది.

(పై వాస్యము ఇవాంజిలికల్ లిటరేచర్ సర్వీస్, చెన్నై వారు ప్రచురించిన 'ట్రెయిల్ బ్లేజర్స్ 5' అనే పుస్తకంలోనిది. ఈ పుస్తకాన్ని యుఇయస్ఐ లిటరేచర్ విభాగంలో ఎంతోకాలం పరిచర్య చేసిన బ్రదర్.ఎం.సంతోష్ కుమార్ రచించారు.)

**– సహోదరి. రూత్ వినయ్,**
రంగారెడ్డి జిల్లా.

# Book Review

Library / – లైబ్రరీ




పుస్తకం పేరు : **'ఆపదలో ఉన్నాం ఆదుకోండి'**
రచయిత్రి : దెబోరా మెరాఫ్
తెలుగు అనువాదం : మంజుల లాజరస్
పుస్తకం ధర : రూ. 100/–
పబ్లిషర్స్ : గుడ్ షెపర్డ్ బుక్స్
ప్రతులకు : OM బుక్స్, హైదరాబాద్.

'సేవ్ అవర్ సిస్టర్స్' అనే ఇంగ్లీషు పుస్తకానికి తెలుగు అనువాదం 'ఆపదలో ఉన్నాం ఆదుకోండి – ప్రపంచవ్యాప్తంగా అపాయంలో ఉన్న బాలికలకు, మహిళలకు చేయూత నందించేందుకు చేపట్టవలసిన చర్యలు'. ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్న ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘనకు ఈ పుస్తకం అద్దంపడుతుంది. దేవుడు మన ద్వారా ఏం చేయగలడో చూడడానికి దీనిలోని సందేశం మనలను పురిగొల్పుతుంది. నా జీవితంలో అతిప్రాముఖ్యమైన పుస్తకాలలో ఇదొకటి అంటారు డా. జార్జ్ వర్వర్.

''వధువుల అమ్మకం, దహనం, భ్రూణహత్యలు, ఆడ శిశువుల హత్యలు, దేవదాసీలు, స్త్రీల విక్రయం, గృహహింస, బాలిక సైనికులు, బాల్య వివాహాలు, తాత్కాలిక వివాహాలు, బలవంతపు వివాహాలు, లేత గర్భాలు, లింగ ఎంపికపై గర్భస్రావాలు, ప్రసూతి మరణాలు, లైంగిక అసమానతలు, అట్టడుగుకు చేరిన ఆరోగ్యం, దౌర్జన్యం, దోపిడీ, దహనం, నిరక్షరాస్యత, స్త్రీ శరణార్థులు, వీధిపాలైన అమాయకుల జీవితాలు" ఇలా అనేక సవాళ్ళు, సమస్యలపై చర్చించి, వ్యక్తులముగా, సంఘాలుగా, సంస్థలుగా తీసుకోవలసిన చర్యలను గురించి వివరించిన అద్భుత పరిశోధన పుస్తకం ఇది.

ఈ విషయాలను గూర్చి సమాచారం తెలుసుకోవడం మాత్రమే కాదు, విజ్ఞాపన చేయాలి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. "అత్యాసక్తితో చేసే ప్రార్థనలు ప్రపంచాన్ని మార్చడమే కాదు వాటిని ప్రార్థించిన వ్యక్తులను సైతం మార్చివేస్తాయి" అంటారు దెబోరా. మనం చేయూత నందించడానికి అనేక సంస్థల వెబ్సైట్స్ కూడా అనుబంధంలో ఇచ్చారు. నేటి ప్రపంచ పరిస్థితులను అర్థం చేసుకుని స్పందించడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరం. మనమంతా తప్పక చదవవలసిన పుస్తకం.

**– సహోదరి.డా.మెర్సి మోషే బాబు,**
తార్నాక.

## దీవెన

**సూర్యోదయం, సూర్యాస్తమయం**
**జరిగిపోతుంటాయి అనుదినం**
**సవాళ్ళతో నూతన సంవత్సరం**
**ఎదురు చూస్తోంది మన కోసం**
**మనమంతా ఒక కుటుంబంగా**
**దీవించబడాలి ప్రభుని సన్నిధిలో**
**పొంగి పొర్లాలి సుఖసంతోషాలతో**
**నింపబడాలి ఆయురారోగ్యాలతో**

**– సహోదరి.డా.మెర్సి మోషే బాబు,**
తార్నాక.




# జనవరి 2020 ప్రార్థనాంశాలు

**ఈస్ట్ తెలంగాణా**

రీజనల్ కో–ఆర్డినేటర్ సహో. వేణు
డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్: ఖమ్మం – సహో. దయాకర్
వరంగల్ – సహో. యం. అనీల్
స్టాఫ్: సహో. రాజేష్ దాసరి
స్టాఫ్ కో–ఆర్డినేటర్ సహో. ఎల్. శ్రీధర్
గ్రాడ్యుయేట్ హెల్పర్:సహో. కె. కిరణ్ కుమార్,

**భూపాలపల్లి:**బాలురకు మరియు బాలికలకు జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌ను బట్టి స్తుతించండి.
స్టూడెంట్స్ ఫాలో అప్, వన్ డే రిట్రీట్ నిర్వహించునట్లు, స్థానిక గ్రాడ్యుయేట్లు ఇ.యు దర్శనమును కలిగి పరిచర్యలో చొరవ చూపునట్లు ప్రార్థించండి.

**ఏటూరు నాగారం:**క్రిస్మస్ ప్రోగ్రాం కొరకు, స్థానిక విద్యార్థుల కాంటాక్ట్స్ నిమిత్తం ప్రార్థించండి.

**ములుగు:**ములుగు, పసర మరియు గోవిందరావు పేటలో క్రిస్మస్ ప్రోగ్రామ్స్ నిర్వహించబడునట్లు, స్థానిక విద్యార్థుల కాంటాక్ట్స్ కొరకు, దేవుడు బ్రదర్. శంకర్ కుటుంబం యొక్క ఆశలను తీర్చునట్లు ప్రార్థించండి.

**నరసంపేట:**ప్రైవేట్ హాస్టల్ మరియు బిసి హాస్టల్స్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్ కొరకై, క్రీస్తును రక్షకునిగా అంగీకరించిన 28 మంది విద్యార్థులను బట్టి స్తుతించండి. 28 మంది స్టూడెంట్స్ ఫాలో అప్, ఎస్.టి హాస్టల్ విద్యార్థులకు క్రిస్మస్ ప్రోగ్రాం నిర్వహించుటకు వెన్యు కొరకు, బ్రదర్. సునీల్ జాబ్ మరియు పరిచర్య బాలెన్స్ చేసుకొనునట్లు మరియు వివాహం కొరకు ప్రార్థించండి.

**తొర్రూర్:**బిసి హాస్టల్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రాం, అంగీకరించిన 14 మంది స్టూడెంట్స్ కొరకై స్తుతించండి. 14 మంది స్టూడెంట్స్ ఫాలో అప్, ఎస్.టి హాస్టల్‌లో క్రిస్మస్ ప్రోగ్రాం, ఇక్కడ ఉన్న చీకటి శక్తులు అంతమొందునట్లు, సింగిల్ గ్రాడ్యుయేట్ సిస్టర్. ఉపేంద్రకు దేవుని నడిపింపు మరియు వివాహం నిమిత్తం ప్రార్థించండి.

**పరకాల్:**క్రిస్మస్ ప్రోగ్రాం జరగకుండా అడ్డుకుంటున్న శక్తులు తొలిగిపోవునట్లు, బ్రదర్. ఉప్పయ్య కుటుంబం కొరకు ప్రార్థించండి.

**రాంపూర్:**బాలుర మరియు బాలికల క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌ను బట్టి స్తుతించండి. స్టూడెంట్స్ ఫాలో అప్, స్థానికంగా ఇబియస్ స్టార్ట్ అగునట్లు, బయోడిగ్రేడబుల్ సంస్థను నిర్వహిస్తున్న బ్రదర్. అరుణ్ మరియు రాజుల కొరకు, ఫైనాన్స్ మరియు వారు కష్టమర్లను, మున్సిపాలిటీ అధికారులను అర్థం చేసుకొనునట్లు ప్రార్థించండి.

**ఘనపూర్:**ప్రైవేట్ హాస్టల్ మరియు బిసి హాస్టల్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్ కొరకై, క్రీస్తును రక్షకునిగా అంగీకరించిన 24 మంది విద్యార్థులను బట్టి స్తుతించండి. 24 మంది స్టూడెంట్స్ ఫాలో అప్, ఇబియస్ స్టార్ట్ అగునట్లు ప్రార్థించండి.

**జనగాం:**ఎస్.టి హాస్టల్ మరియు బిసి హాస్టల్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్ కొరకై, క్రీస్తును రక్షకునిగా అంగీకరించిన 29 మంది విద్యార్థులను బట్టి స్తుతించండి.
వారి ఫాలో అప్, ఇబియస్ స్టార్ట్ అగునట్లు, బైబిల్ స్టడీ వెన్యు కొరకు ప్రార్థించండి.

**మహబూబాబాద్:**బ్రదర్. అనుదీప్ కుమారుడు శ్రీజస్ ఇమాన్యుయేల్‌కు ఇచ్చిన స్వస్థత, స్థానిక కాలేజిలో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌ను బట్టి స్తుతించండి.
ఈ నెలలో నిర్వహించనున్న క్రిస్మస్ ప్రోగ్రామ్స్, అంగీకరించిన స్టూడెంట్స్ ఫాలో అప్, సిస్టర్. మౌనిక వివాహం నిమిత్తం ప్రార్థించండి.

**వరంగల్:**విజయవంతంగా జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్, అంగీకరించిన స్టూడెంట్స్, అన్ని ప్రోగ్రామ్స్ ఆటంకం లేకుండా జరుగుటలో దేవుని సహాయము. బ్రదర్. నాగరాజు కుటుంబానికి దేవుడు బహుమానముగా ఇచ్చిన కుమార్తెను బట్టి స్తుతించండి.

ఇబియస్, బిబియస్, ఇజియఫ్ సమర్థవంతంగా మరియు అర్థవంతంగా జరుగునట్లు, స్టూడెంట్స్ ఆత్మీయ ఎదుగుదల, అవుట్ రీచ్ మినిస్ట్రీ (పరకాల, తొర్రూర్, రాంపూర్) కొరకు, వరంగల్ స్టూడెంట్స్ మరియు గ్రాడ్యుయేట్స్ కొరకు, ట్రైకాన్ 2020కి ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడి హాజరగునట్లు, ఫిబ్రవరిలో డిటి క్యాంప్ కొరకు ప్రార్థించండి.

**నార్త్ తెలంగాణా**

రీజనల్ కో-ఆర్డినేటర్: సహో. కె. శ్రీనివాస్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్: అదిలాబాద్ - సహో. లూథర్ కింగ్
కరీంనగర్ - సహో. డి. రాము
స్టాఫ్: కరీంనగర్ - సహో. ఎన్. మోహన్
స్టాఫ్‌కో-ఆర్డినేటర్ : - సహో. నెహెమ్యా

**పెద్దపల్లి:**జరిగిన సెమి క్రిస్మస్, సెమిస్టర్ ఎగ్జామ్స్, జెయన్‌టియు మంథనిలో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్‌లో అంగీకరించిన 9 మంది విద్యార్థులను బట్టి స్తుతించండి. జెయన్‌టియు మంథనిలో ఫాలో అప్ మరియు గర్ల్స్ మినిస్ట్రీ కొరకు, బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగునట్లు, కమిటీ మెంబర్స్ అందరు పరిచర్యలో చురుకుగా పాల్గొనునట్లు, పయనీరింగ్ కాలేజ్‌ను రీచ్ అగునట్లు, అందరి ఆత్మీయ అభివృద్ధి నిమిత్తం ప్రార్థించండి.

**వెస్ట్ తెలంగాణా**

రీజనల్ కో-ఆర్డినేటర్: సహో. ఆర్. వినయ్ కుమార్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్: నిజామాబాద్ - సహో. జి. మహారాజ్
మెదక్ - సహో. పి. నరేంద్ర
స్టాఫ్: కామారెడ్డి - సహో. కె. రవికుమార్
సంగారెడ్డి - సహో. సి.హెచ్. ప్రభాకర్
గ్రాడ్యుయేట్ హెల్పర్ సహో. డి. సుధాకర్

**కామారెడ్డి:** క్రమంగా జరుగుచున్న బిబియస్ మరియు ఇజియఫ్‌ల గురించి, జరిగిన మినీ డిటి క్యాంప్‌ను బట్టి స్తుతించండి.

క్రిస్మస్ ప్రోగ్రామ్స్, డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షల ప్రిపరేషన్ నిమిత్తం ప్రార్థించండి.

**సంగారెడ్డి:**ఎస్సి, బిసి హాస్టల్స్‌లో, స్థానికంగా మరియు గ్రాడ్యుయేట్స్ క్రిస్మస్‌లు జరిగిన దాన్ని బట్టి స్తుతించండి. డ్రిజిల్ బాప్తిస్మ సిద్ధపాటు, 21న ప్రయాణం, బ్లెస్సి 27న ప్రయాణం, వారి చదువుల మరియు ఆత్మీయ జీవితం కొరకు, సిస్టర్. భాగ్య జాబ్ సెక్యూరిటి, పిల్లలు మరియు బ్రదర్.నాగిరెడ్డి వర్క్, ప్రయాణం, ఆరోగ్యం కొరకు, సిస్టర్.విక్టోరియా పర్మినెంట్ జాబ్, తన భర్త జాబ్ మరియు వారి ఆత్మీయ జీవితం కొరకు ప్రార్థించండి.

**పటాన్‌చెరు:**4 క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌లో 150 మందికి సువార్త అందించినందుకు, సిస్టర్.సుమిత్రకు ఆపరేషన్ విజయవంతముగా జరిగించినందుకు మరియు త్వరగా కోలుకొనునట్లు, క్రమముగా జరుగుచున్న బిబియస్ దేవుని నడిపింపు, బ్రదర్.స్వరాజ్ యొక్క పెద్ద కుమారుని భవిష్యత్తు, సిస్టర్.ప్రవీణ ఇయు పరిచర్యను అర్థం చేసుకొనునట్లు, బ్రదర్.శంకర్ ఇన్వాల్‌వెంట్, బ్రదర్.సుధాకర్ ఉద్యోగంలో ప్రమోషన్, సింగిల్ గ్రాడ్యుయేట్స్ బ్రదర్.దిలీప్, రమేష్ మరియు ఇతరుల భవిష్యత్తు, గ్రాడ్యుయేట్స్ అందరి మధ్య ప్రేమ, మంచి సహవాసము ఉండడానికి దేవుడు సహాయం చేయులాగున ప్రార్థించండి.

**సెంట్రల్ తెలంగాణా**

రీజనల్ కో-ఆర్డినేటర్: సహో. బి. దేవరాజ్
డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్స్: హైదరాబాద్ - సహో. వై సత్యవేలు
రంగారెడ్డి - సహో. సి. శ్రీకాంత్
స్టాఫ్: హైదరాబాద్ - సహో. కె. గాబ్రీయేల్
రంగారెడ్డి - సహో. జి. సందీప్
స్టాఫ్‌కో-ఆర్డినేటర్స్: వికారాబాద్ - సహో. సి హెచ్ నాగరాజు
రంగారెడ్డి - సహోదరి ఎలిజబెత్ సాలోమోన్
హైదరాబాద్ - సహో. రాజ్ కుమార్
గ్రాడ్యుయేట్ హెల్పర్స్: రంగారెడ్డి
సహో. బి. రామకృష్ణ, హైదరాబాద్
సహోదరి. ప్రవల్లిక

**సెంట్రల్ తెలంగాణ:**

**కూకట్‌పల్లి:**రెగ్యులర్‌గా అర్థవంతంగా జరుగుచున్న 3 బిబియస్, 2 ఇబియస్‌లను బట్టి, 5 శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ క్యాంపస్‌లో జరుగుతున్న ఇబియస్ సెల్స్‌ను బట్టి, 2 ఇజియఫ్ సెల్స్‌ను బట్టి సుత్తించండి. నవంబర్ 16న ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థుల కోసం జరిగిన క్రిస్మస్ ప్రోగ్రాంలో 49 మంది విద్యార్థులు అటెండ్ అగుటను బట్టి, ప్రభువుని అంగీకరించిన 13 మంది విద్యార్థుల కొరకు, జరిగిన ఫాలో అప్, బ్రదర్.శ్యామ్ మరియు సిస్టర్.రమలకు దేవుడనుగ్రహించిన రెండవ కుమారుని బట్టి, బ్రదర్.బెర్రీ జాకబ్‌కు వచ్చిన ఇంటర్న్ షిప్, బ్రదర్.రోహన్‌కు టిసియంన్‌లో ప్రభువిచ్చిన ఉద్యోగాన్ని బట్టి, బ్రదర్.టి.రామకృష్ణకు యు.ఎస్‌లో వచ్చిన పిహెచ్.డి సీట్‌ను బట్టి స్తుతించండి.

జెయన్‌టియు-డిసెంబర్ 19,15,21,22 లలో శ్రీ చైత్యన క్యాంపస్‌లలో క్రిస్మస్ ప్రోగ్రామ్స్ కొరకు, విద్యార్థులు మరియు గ్రాడ్యుయేట్స్ పరిచర్య, చదువులు, ఉద్యోగాలు

బాలెన్స్ చేసుకొనులాగున– స్టూడెంట్స్ ఎగ్జామ్స్ మరియు ఫలితాల కొరకు, గ్రాడ్యుయేట్స్ మెంటరింగ్ సీరియస్‌గా చేయునట్లు, సిస్టర్.గ్రేస్ రత్నరాజ్ తల్లి ఆరోగ్యం కోసం, సిస్టర్.లావణ్య తండ్రి గారి ఆరోగ్యం కోసం ప్రార్థించండి.

**వికారాబాద్:**కొంపల్లి హాస్టల్‌లో 60 మందికి, వికారాబాద్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రాంలో 30 మందికి సువార్త అందించడానికి దేవుడు చేసిన సహాయాన్ని బట్టి, వికారాబాద్ మినిస్ట్రీలో దేవుని నడిపింపును బట్టి స్తుతించండి.

కొంపల్లిలోను, వికారాబాద్‌లోను క్రిస్మస్ ప్రోగ్రాంకు వచ్చిన విద్యార్థుల ఫాలో అప్ కొరకు, గర్ల్స్ స్టూడెంట్స్ మధ్య పరిచర్య కొరకు, డిగ్రీ విద్యార్థుల సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో మంచి ఫలితాలు, బ్రదర్.వెంకట్ ఇంటి నిర్మాణం, ఇయు మరియు ఇజియఫ్ బైబిల్ స్టడీస్ క్రమముగా జరుగులాగున, సిస్టర్.స్వర్ణకళ సుఖప్రసవం నిమిత్తం ప్రార్థించండి.

**బోయిన్‌పల్లి:**బ్రదర్.తిలక్, సిస్టర్.సునీత కుటుంబం కొరకు వారి యొక్క కుమారులు స్టీఫెన్, ఎఫ్రాయిమ్ ఎగ్జామ్స్ కొరకు, సీనియర్ అడ్వైజర్ బ్రదర్.యాకోబు, సిస్టర్.స్వప్న కుటుంబం కొరకు వారి యొక్క పేరెంట్స్ ఆరోగ్యం కొరకు, బ్రదర్.నరేష్ మ్యారేజ్ మరియు సెటిల్మెంట్ కొరకు, బ్రదర్.రాహుల్ ఎగ్జామ్స్ కొరకు మరియు ఆత్మీయంగా బలపడడం కొరకు, బ్రదర్.సిద్ధార్థ ఆరోగ్యం మరియు కుటుంబం కొరకై ప్రార్థించండి.

**బిహెచ్ఇఎల్:**జరిగిన మూడు ఇయు మరియు ఇజియఫ్ క్రిస్మస్ ప్రోగ్రాంల కొరకై, నూతన కాంటాక్ట్స్‌ను బట్టి స్తుతించండి.

నూతన విద్యార్థుల ఫాలో అప్ మరియు వారికి ఇబియస్ స్టార్ట్ అగునట్లు, ఎగ్జామ్స్ రాస్తున్న విద్యార్థుల కొరకు, బైబిల్ మరియు మైక్రో ప్రేయర్ సెల్స్ క్రమంగా అర్థవంతంగా జరుగునట్లు, డయాలిసిస్‌లో ఉన్న బ్రదర్.ఆలిస్ విక్టర్ ఆరోగ్యం కొరకు, సిస్టర్.నిస్సి మరియు సిస్టర్.అనితల సుఖ ప్రసవం నిమిత్తం ప్రార్థించండి.

**సికింద్రాబాద్:** జరిగిన క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌ను బట్టి స్తుతించండి.

జాయ్ మరియు జిస్ట్ రిజల్ట్స్ కొరకు, ఇయు స్టూడెంట్స్ స్పిరిచ్యువల్ గ్రోత్, బ్రదర్.రామారావ్ జేఎల్ ఎగ్జాం, బ్రదర్.నారాయణ కుటుంబ రక్షణ, నూతన కమిటీ దేవుని చిత్తములో పరిచర్యను నడిపించునట్లు, ఇజియఫ్ మెంబర్స్ అంతా క్రమంగా ఇజియఫ్‌కు అటెండ్ అగునట్లు, క్రమంగా కాంట్రిబ్యూషన్ పంపునట్లు, సిస్టర్.అర్చన జాబ్, బ్రదర్.విష్ణు యుపిఎస్సి ప్రిపరేషన్ మరియు కుటుంబం దేవునికి మహిమకరంగా కట్టబడునట్లు ప్రార్థించండి.

**హయత్‌నగర్:**సిస్టర్ సంధ్యకు దేవుడు అనుగ్రహించిన గర్భఫలాన్ని బట్టి స్తుతిస్తూ వారి ఆరోగ్యం నిమిత్తం ప్రార్థించండి. బ్రదర్.పాల్‌కు గవర్నమెంట్ జాబ్, బ్రదర్.రంగారావు ఫ్యామిలీ, బ్రదర్.కోటేశ్వరరావు ఫ్యామిలీ కొరకు, సిస్టర్.రత్న సహోదరుల రక్షణ కొరకు, ఇజియఫ్ మరియు బైబిల్ స్టడీస్ క్రమంగా జరుగునట్లు,ఎస్సి గర్ల్స్ హాస్టల్ బైబిల్ స్టడీస్ నిమిత్తం ప్రార్థించండి.

**సన్‌సిటీ:**2019 సం॥లో అన్ని ప్రోగ్రామ్స్ మరియు ఇసి, డిటి, ఫాలో అప్‌లలో దేవుని కృప, దయ, సన్నిధిని బట్టి, 15మంది బాయ్స్, నలుగురు గర్ల్స్ హాజరు అయినదాన్ని బట్టి, ప్రేయర్ వాక్ టీమ్, బాయ్స్ హాస్టల్, మోయినాబాద్, సిబిఐటి లలో క్రిస్మస్ ప్రోగ్రామ్స్, 8 మంది దేవుని అంగీకరించిన దాన్ని బట్టి స్తుతించండి.

ఫాలో అప్, వాలడిక్టరి ఫంక్షన్, 2020 ఇయర్ ప్లాన్, బ్రదర్.సుబ్బారావు పిహెచ్.డి పూర్తి కాగలుగుటకు, సింగిల్ గ్రాడ్యుయేట్స్ బ్రదర్.శాంతరాజ్ యొక్క ఆర్థిక ఇబ్బందుల కొరకు, బ్రదర్స్.భరత్, అఖిల్, శాంతరాజ్, సిస్టర్స్.ఆనంది, నీలిమాల యొక్క ఉద్యోగం మరియు వివాహం కొరకు, ఇయు స్టూడెంట్స్ చదువులు మరియు కళాశాల క్యాంపస్‌లో సాక్ష్యాన్ని లేవనెత్తుటకు, దేవుని చిత్తంలో ఉన్న విశ్వాస విద్యార్థులను యల్‌టి మరియు సియమ్‌టిసి లకు పంపించులాగున, ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ తమ మాదిరికరమైన జీవితం ద్వారా సక్సెసర్స్‌ను తయారు చేయులాగున ప్రార్థించండి.

## సౌత్ తెలంగాణా

రీజనల్ కో–ఆర్డినేటర్: సహో. వెంకన్న
డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్స్: నల్గొండ – సహో. సి.హెచ్. రాబర్ట్
మహబూబ్‌నగర్ – సహో. వెంకస్వామి
స్టాఫ్: మహబూబ్‌నగర్ – సహో. ఓబులేసు
నల్గొండ – యన్. శ్రీనివాస్
గ్రాడ్యుయేట్ హెల్పర్:–సహో. జి. దేవేందర్, గద్వాల్

**సూర్యపేట:**ఎస్సి హాస్టల్‌లో జరిగిన క్రిస్మస్ ప్రోగ్రాంను బట్టి స్తుతించండి

సెమి క్రిస్మస్ ప్రోగ్రాంకు అటెండ్ అయిన బాయ్స్ ఫాలో అప్ కొరకు, బ్రదర్స్.దినేష్, ప్రభాకర్, సిస్టర్స్.మమత, మౌనిక, స్వప్న, స్వాతి మరియు ప్రియాంక విశ్వాసములో స్థిరపడునట్లు, బ్రదర్.ప్రశాంత్, పి.ప్రశాంత్, సిస్టర్.పూజల వివాహం మరియు కెరీర్ నిమిత్తం ప్రార్థించండి.

# THE DOCTRINE OF TRINITY




**I.Introduction**

The word Trinity is never found in the Bible, though the idea represented by the word is taught in many places of Bible. The word itself comes from the Latin '*trinitas*' which connects three (*tres*) with one (*unns*) which means "Tri-unity" or "Three-in-oneness". It is used to summarize the teaching of scripture that God is three persons yet one God. The early christians could not avoid the idea of God as Father, Son and Spirit.

**II.Description**

i.Definition

***God eternally exists as three persons, Father, Son and Holy Spirit and each person is fully God, and there is one God.***

This doctrine teaches that God exists in three persons who share the same essence or being. This means is that God exists in the distinct and co-equal persons of the Father, the Son and the Holy Spirit, but they share a fully divine essence or being such as eternality, immutability (unchangeableness), omniscience (all wise and knowing), omnipotence (all powerful), goodness, mercy, holiness, will, freedom and so on. That is, the Father, the Son and the Holy Spirit duplicate the same attributes. One is not more wise or merciful or holy than the other.

ii.Biblical basis

a.Old Testamant

Although the doctrine of the Trinity is not explicity found in the Old Testament, several passages suggest or even imply that God exists as more than one person (Gen 1:26). In the first chapter of Genesis, we have an indication of a plurality of persons in God himself. Like wise we can see in Gen 3:22, Gen 11:7, Isaiah 6:8 (whom shall I send, and who will go for us?). The combination of singular (I) and plural (us) in the same sentence.

In Psalm 110:1, David says, "The Lord says to my Lord" sit at my right hand until I make your enemies a footstool for your feet. Jesus rightly said that David is reffering to two seperate persons as "Lord" (Matt 22:41-46), but who is David's "Lord if not God himself ?And who could be saying to God, "sit at my right hand" except some one else who is also fully God? From a New Testament perspective, we can paraphrase this verse: God the Father said to God the Son, "sit at my right hand". But even without the New Testament teaching on the Trinity, it seems clear that David was aware of the plurality of persons in one God.

b.New Testament

When the New Testament opens, we enter into the history of the coming of the Son of God to earth. It is to be explained that this great event would be accompained by more explicit teaching about the trinitarian nature of God.

When Jesus was baptized, "the heavens were opened and he saw the spirit of God descending like a dove, and alighting on him, and lo, a voice from heaven saying "This is my beloved son, with whom I am well pleased" (Matt 3:16-17). Here at one moment we have

three members of the Trinity performing three distinct activities. God the Father is speaking from heaven; God the Son is being baptized and is then spoken to from heaven by God the Father; and God the Holy Spirit is descending from heaven to rest upon and empower Jesus for his ministry.

At the end of Jesus' earthly ministry, he tells the disciples thet they should go "and make disciples of all nations, baptizing them in the name of the Father and of the Son and of the Holy Spirit." (Matt 28:19)

Three statements summarize the Biblical teaching.
1.God is three persons
2.Each person is fully God
3.There is one God




1.God is three persons
John 1:1-2 tells us "In the beginning was the word and the word was with God and the word was God. He was in the beginning with God." The fact that the "word" (who is seen to be Christ in vv 9-18) is "with" God shows distinction from God the Father. The fact that is three persons means that the Father is not the Son, Father is not the Holy Spirit and Son is not Holy Spirit. They are distinct persons.
2.Each person is fully God.

i.God the Father is fully God
This is evident from the first verse of the Bible, where God created the heaven and the earth.

ii.God the Son is fully God
John 1:1-4 cleary affirms the full deity of Christ.

iii.God the Holy Spirit is fully God
Once we understand God the Father and God the Son to be fully God, then the trinitarian expressions in verse like Mt 28:19 show that the Holy Spirit is classified on an equal level with Father and the Son

3.There is one God
Scripture is abundantly clear that there is one and only one God. The three different persons of the Trinity are not only in purpose and in agreement on what they think, but they are one in essence, one in their essential nature.When God speaks, he alone is speaking - he is not speaking as one God among three who are to be worshipped.

"I am the Lord and there is no other, besides me there is no God. I grid you, though you donot know me; that men may know, from the rising of the sun and from the west, that there is none beside me;

I am the Lord, and there is no other." (Is 45:5-6)

III.Heresis/Doctrinal deviations
i.Mormonism
Ther is one God who generated the other Gods.

ii.Sabellianism
There is one person (God) who manifested himself in three forms.

iii.Arianism
There are three persons with variation in divinity and independence. This teaching was condemned at the Council of Nicea in A.D 325.

The challenge of heresis forced the church to come up with profound doctrinal statements. The early church affirmed at various points of time that God was really acting in Jesus Christ and in the Holy Spirit and that the whole of Godhead is fully present in each of the

'persons'.

IV.Importance of the Trinity

For example,salvation portrays the work of the Triune God. The Father sent the Son to accomplish the work of redemption. The Son sent the Spirit to bring conviction and to apply to man what Christ had accomplished. This doctrine helps us to understand that the functions ascribed to each of the persons in the Godhead, especially in man's redemption there is a certain degree of subordination involved in function not in nature.

V.Implications of the Trinity

1.God can be known by accepting His self-revelation.

2.Trinity is a mystry that may transcend reason but never contradict it.

3.Enables us to offer true worship (it reveals the ultimate, eternal God).

4.Helps us to understand the true riches of our life in Christ.

5.Lays the foundation of harmonious relationship in family, church and society.

**VI.Questions**

i.What does the doctirne of Trinity assert?

ii.Imagine yourself speaking to

a) a friend from a diiferent faith background (who belives in many Gods)

b) a friend (who denies Biblical authority but believes in one God)

How would you explain God's three-in-oneness to each of them?

iii.How does Trinity lays the foundation of harmonious relationship in family, church and society.


References:

1.*Wayne Grudem, Systematic Theology (GS Books 2018)*

2.*Paul Enns, The Moody handbook of Theology (GS Books, 2017)*

3.*Brian Edgar, The Message of the Trinity (IVP 2011)*

4.*http://uesi.in/wp-content/uploads/2019/05/Notes-on-Complete-Doctrines-Final-12-04-2019.pdf*


-Bro.John Bhushanam, Nallakunta.




**1.** 120 మున్సిపాలిటీలలోని 2727 వార్డులు, 9 మున్సిపల్ కార్పొరేషన్‌లలోని 325 డివిజన్‌లకు ఎన్నికల నోటిఫికేషన్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారిచేసింది. జనవరి 22 ఉదయం 7 గం॥ నుండి 5 గం॥ల వరకు పోలింగ్ జరుగనుంది.

**2.** అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం మరియు ప్రాంతీయ భద్రత వ్యవహారాలపై ట్రంప్, మోదీలు ఫోన్‌లో చర్చలు జరిపారు.

**3.** జెయన్‌యు, ఢిల్లీలో ముసుగులు ధరించిన దుండగులు పలువురు విద్యార్థులు, టీచర్‌లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధిత విద్యార్థులకు, టీచర్‌లకు, పలువురు సంఘీభావం తెలిపారు. ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**4.** నిర్భయ దోషులకు ఈ నెల 22 ఉదయం 7 గం॥లకు ఉరిశిక్ష ఖరారు కాగా చివరి అవకాశంగా కురేటివ్ పిటిషన్ సుప్రీం కోర్టులో దాఖలు చేయనున్నారు.

**5.** అమెరికా, బ్రిటన్ తరువాత విదేశీ విద్య ఔత్సాహికులకు ఆస్ట్రేలియా ప్రముఖ గమ్యంగా నిలిచింది. మన దేశం నుండి ఆస్ట్రేలియా వైపు దృష్టిసారిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

**6.** టోక్యో ఒలంపిక్స్ ఈక్వెస్ట్రియన్ (అశ్విక క్రీడలు) ఈవెంట్‌లో భారత హార్స్ రైడర్ ఫౌద్ మిర్జా అర్హత సాధించి అధికారికంగా బెర్త్ ఖాయం చేసుకున్నాడు.

**7.** భారత్ నెలవారి తలసరి ఆదాయం 2019–'20 లో 6.8 శాతం పెరిగి రూ.11.254కు చేరుతున్నట్లు గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసింది.

# వీర వనిత యాయేలు



" యెహోవా ఒక స్త్రీ చేతికి సీసెరాను అప్పగించును" – దెబోరా. ఇరవై సంవత్సరాలు ఇశ్రాయేలీయులను కఠినముగా బాధపెట్టిన కనాను రాజైన యాబీను సేనాధిపతి సీసెరా. ఇతడు తొమ్మిది వందల ఇనుపరథాలతో శత్రువుల వెన్నులో వణుకు పుట్టించే క్రూర సేనాని. సీసెరా ఉక్కుపాదం క్రింద ఇరవై సుదీర్ఘ సంవత్సరాలు దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు మగ్గిపోయారు. వారు దేవునికి మొఱ్ఱపెట్టడానికి ప్రధానమైన కారణం సీసెరా.

రామాకు బేతేలుకు మధ్య సరళవృక్షం క్రింద ఒక స్త్రీ కూర్చొని ఉంది. ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతి మరియు ఒక ప్రవక్త్రి. ఆమె ఎవరోకాదు... దెబోరా. "బారాకూ! నీవు వెళ్ళి పదివేల మంది మనుష్యులను నఫ్తాలీయులలో నుండి, జెబూలూనీయుల నుండి తాబోరు కొండ వద్దకు తీసుకురా!" గంభీరమైన కంఠంతో ఆదేశించింది. బారాకు నఫ్తాలీ కెదెషు వాడైన ఇశ్రాయేలీయుడు, అబీనోయము కుమారుడు. దెబోరా ఇచ్చిన ఆజ్ఞను అనుసరించి పదివేలమంది మనుష్యులను కూర్చుకొని తాబోరు కొండ మీదికి వెళ్ళాడు. ఈ విషయం తెలుసుకున్న సీసెరా ఉగ్రుడై తొమ్మిది వందల ఇనుప రథాలతో తన పక్షముగానున్న వారితో కొండ దిగువ ప్రాంతానికి రాగా "యెహోవా నీకు ముందుగా బయలు దేరును, ఇది సీసెరా కలవరపడే సమయం" అని దెబోరా పిలువగా, బారాకు పదివేల మందితో తాబోరు కొండను దిగి సీసెరాను ఎదుర్కొన్నాడు. యెహోవా సీసెరాను అతని సర్వసేనను కలవరపరచగా, సీసెరా తన రథము దిగి పారిపోవడం ప్రారంభించాడు.

యాయేలు గుడారం... కయీనీయుడైన హెబెరు భార్య యాయేలు. హెబెరు కయీనీయుడైనా వారితో వేరుపడి కెదెషు దగ్గర జయనన్నీములో ఒక మస్తకి వృక్షము వద్ద గుడారము వేసికొని జీవిస్తున్నారు. ఇరవై సంవత్సరాలుగా ఇశ్రాయేలీయుల శ్రమల జీవితాన్ని దగ్గరగా చూస్తున్నారు. తమ జాతివారంతా యూదా ప్రాంతానికి దక్షిణమున నివసించినా ఈ కుటుంబం వారిలో నుండి వేరుపడి కనానులో ఉత్తరముగా గలిలయ సముద్రానికి పడమరగానున్న కెదెషు(కాదేషు) లో నివసిస్తున్నారు. హెబెరు భార్యయైన యాయేలు గొప్ప ధైర్యవంతురాలు. ఇశ్రాయేలు ప్రజలకు సహాయం చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్న స్త్రీ.

సమయం రానే వచ్చింది. యుద్ధభూమి నుండి వెన్ను చూపి కాలికి బుద్ధి చెప్పిన సీసెరా యాయేలు గుడారం వైపే వస్తున్నాడు. బారాకు వెనుక నుండి తరుముతూ వస్తున్నాడు. ప్రాణభయం, అలసట, ఆకలి, దాహం అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడారిలో ఒయాసిస్సులా యాయేలు గుడారం కనిపించింది. ఎదురు చూస్తున్న అవకాశం తన ఎదుటనే నిలచింది. యాయేలు అవకాశాన్ని వదులుకోదలచుకోలేదు. మరణ భయంతో పరుగిడుతున్న సీసెరాను తన గుడారంలోకి ఆహ్వానించింది. భయపడవద్దని అభయమిచ్చింది. వెదుకుతున్న తీగ కాలికి తగిలినట్లు సీసెరా నిర్భయంగా గుడారంలో అడుగు పెట్టాడు. దాహానికి నీళ్ళిమ్మని యాయేలును అడిగాడు. యాయేలు పాల పాత్రను అతనికిచ్చి, గొంగలి కప్పి విశ్రాంతి తీసుకోమని చెప్పింది. నా కోసం ఎవరైనా అడిగితే లేదని చెప్పడానికి గుడారపు వాకిట్లో ఉండుమని యాయేలును కోరి నిర్భయంగా సీసెరా నిద్రలోకి జారుకొన్నాడు.

ఇశ్రాయేలీయులను భయభ్రాంతులను చేసిన సీసెరా మొట్టమొదటి సారిగా తన జీవితంలో భయం అంటే ఏమిటో రుచిచూచాడు. 'ఇది నా సమయం' యాయేలుకు ఇశ్రాయేలీయుల ఇరవై సంవత్సరాల శ్రమలు గుర్తుకు వచ్చాయి. దేవుని ప్రజలు సీసెరా ఇనుప రథాల క్రింద నలిగిన దినాలు కళ్ళముందు కనిపిస్తున్నాయి. యెహోవా తన ప్రజల ఆక్రందనలు విన్న దినం ఇదే అని, వారి విడుదల సమయం రానే వచ్చిందని యాయేలు తెలుసుకుంది. ఒక్క నిమిషం కూడా వృథా చేయకూడదని తలంచింది. తన చుట్టూ పరిశీలించింది. గుడారపు మేకు కనిపించింది. తన చేతిలోనికి తీసుకుంది. మరొక చేత్తో సుత్తె పట్టుకుంది. అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా సీసెరాను సమీపించింది. సీసెరా ఆదమరచి నిర్భయంగా గాఢనిద్రలో ఉన్నాడు. మేకు నేలకు దిగేటట్లు అతని కణత భాగంలో బలంగా సుత్తెతో కొట్టింది. నాకు తిరుగు లేదనుకొని విర్రవీగిన సీసెరా మరణించాడు. యాయేలు ఎంత ధైర్యవంతురాలు! ఎంత పరాక్రమవంతురాలు! దేవుని ప్రజల కోసం ధైర్యంతో శత్రువును మట్టు పెట్టింది. "... యాయేలు స్త్రీలలో దీవెన నొందును." న్యాయాధిపతులు 5:24.

యాయేలు అను పేరుకు అడవి మేక అని అర్థం. నిటారుగా ఉన్న పర్వత శ్రేణులను సహితం ధైర్యంగా ఎక్కగల నైపుణ్యం అడవి మేక సొంతం. ఇశ్రాయేలు ప్రజల జీవితంలో పర్వతంలాంటి సమస్యకు దేవుని సహాయంతో అవలీలగా యాయేలు ముగింపునిచ్చింది. దేవుని పరిచర్యకు ఆటంకాలుగా ఉన్న సాతానుడి కోట గోడలను కూల్చడానికి యాయేలు ధైర్యసాహసాలు మనకు ఆదర్శం. **– సహో. విజయ్ ప్రసాద్**




**1. What is cholesterol?**

Cholesterol is one type of fat. Some fats increase the weight in human beings. It is seen in Obese and huge structured people.

**2.Why cholesterol is harmful?**

When there is more cholesterol in the blood, it blocks the blood vessel and causes heart attack and stroke. High cholesterol is very dangerous in people who have sugar and chain smoking habit.

**3.What are the causes for high cholesterol?**

- The food that we eat consist of one third of cholesterol.
- Mutton, beef, pork, skin of chicken, fat coating of milk, ghee, dalda, coconut.
- Oil, palm oil consists of more cholesterol.
- Those who drink alcohol also get cholesterol.

**4.What are the ways and means to reduce cholesterol?**

- Do not use palm oil, coconut oil, ghee.
- Allowed to use sun flower oil and peanut oil.
- Eat mutton and beef after removing fat coating.
- Can eat chicken after removing the skin.
- Fish has no cholesterol. Therefore you can eat freely.
- Drink milk after removing the fat coating.
- Do not eat more than 3or 4 eggs in a weak.
- Completely avoid drinking of alcohol.
- More exercises and hard work for one hour will reduce cholesterol.
- If people with high cholesterol smoke beedi, cigerettes there is more risk to get heart disease.
- If we are not eating the food that have high cholesterol also our liver in the body itself produces two third (2/3) of cholesterol.

**5.How do you know that you have high cholesterol in your blood?**

- You will not have any symptoms so that you donot know.
- Only way is to check the blood.

**6.Who are all need to check the blood for choleterol?**

- After getting heart disease, treating cholesterol is very difficult.
- Therefore once in 2 years or 5 years as a prevention it is good to check the blood for cholesterol.
- Above 35 years.
- People with high blood sugar (Diabeties).
- Smokers.
- Before 60 years if anybody in your family Father, Mother, Siblings have got heart disease, there is more tendency to get heart disease.

- Missionary Upholders Trust



# నిజమైన శత్రువు నుండి దేవుని కాపుదల

– సహో.రవి కుమార్, స్టాఫ్, ఆర్మూర్.

యెహోవా విశ్వాసులను కాపాడును. కీర్తన 31: 23. రక్షించుట అనేది ఆయన వ్యక్తిత్వము. తన వారిని దుష్టుని నుండి కాపాడాలనే తన నిబంధనకు దేవుడు ఆది నుండి కట్టుబడియున్నాడు. ఆయన ప్రేమ, కృప మరియు శక్తిని మనము సరిగ్గా అర్థము చేసుకోలేదు కనుకనే సాతానుకి భయపడతాము. సాతానుని విజయశీలునిగా చూస్తాము. సాతాను యొక్క బలము, వాని ప్రణాళికలు మరియు వాని నిజస్థితిని గురించి దేవునికి తెలిసినంతగా మరెవ్వరికి తెలియదు. దేవుడు నిత్యము సాతునుపై విజయము సాధిస్తూనే ఉంటారు. తన కుమారుని మరణమునకు అప్పగించుట ద్వారా సాతానుని ఓడించి వాని భవిష్యత్తును దేవుడు తేల్చివేస్తాడు మరియు దయ్యములు కూడా దేవుడు ఒక్కడే అని నమ్మి దేవునికి భయపడతాయి. యాకోబు 2:19. దేవుని సహాయమును, అధికారమును మనము తెలుసుకోవడము ఎంతో దీవెనకరము.

**సాతానుని పరిమితులు:**

1.Satan can not do all that he wishes:వాని కోర్కెలు చాలా భయంకరముగా ఉంటాయి. దేవునిగా ఉండాలనే వాని ఆశను బట్టి వాడెంత దుర్మార్గపు కోర్కెలు గలవాడో చెప్పవచ్చు. విశ్వాసుల యెడల, ఈ లోకము యెడల వాని కోర్కెలు మరింత దారుణముగా ఉంటాయి. అయితే తాను ఆశించిన వాటినన్నిటిని వాడు నేరవేర్చుకోలేడు.

2.Satan is super human, but not divine: మానవులకంటే కొంత ఎక్కువ శక్తి గలవాడు అంతే గాని సాతానుడు దేవుడు కాడు. దేవుడు చేయు పనులు చేయలేడు.

3. Satan is not omniscient:సాతానుడు సర్వజ్ఞాని కాడు. దేవుని మనస్సు తెలుసుకొనలేడు. మన మనస్సును కూడా చదువలేడు, గ్రహించలేడు. దేవునికి మాత్రమే ప్రతి మానవుని యొక్క హృదయము తెలుసు. 1 రాజులు 8:39. అయితే, ఆది నుండి సాతానుడు తనకున్న అనుభవముతో ఊహించి ప్రస్తుతమున్న మనలను కలవరపరుస్తాడు. కొంత ఊహించి ఏవో చిత్ర విచిత్రమైన వాటిని మన మీద ప్రయోగించి వాడు విజయము పొందుతాడు అంతే.

4. Satan is not omnipresent:సాతానుడు సర్వవ్యాపి కాడు. అన్ని ప్రాంతాలలో ఒకేసారి ఉండలేడు. వాని అనుచరుల సహాయముతో భూలోకమంతటిని ప్రభావితము చేయాలని చూస్తాడు. విశ్వాసుల హృదయాల్లో వాడు నివాసము ఏర్పరచుకోలేడు.

5. Satan can not change the plans and will of God:దేవుడు సమస్త క్రియలను చేయగలడు. ఆయన ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదు. యోబు 42:2. గనుక సాతానుడు దేవుని చిత్తాన్ని మరియు ప్రణాళికలను మార్చలేడు. దేవుని ప్రభుత్వము మరియు అధికారము యొక్క దరిదాపులలోకి సాతానుడు అడుగు పెట్టలేడు. ఎందుకంటే దేవుని సార్వభౌమాధికారం నిరాటంకమైనది (unrestricted), దేవుని నీతి అసమానమైనది (unequalled), దేవుని అధికారము ఎదురులేనిది (unchallenged), దేవుని న్యాయము అనివార్యమైనది (unavoidable) మరియు దేవుని జ్ఞానము వివరించలేనిది (unexplainable).

6. Satan can not be loved by God:దేవుని ప్రేమను మరియు క్షమాపణను సాతానుడు పొందుకోలేడు. పరలోకము సాతానునికి ఇవ్వబడదు.

**సాతానుని ప్రయత్నాలు మరియు దేవుని కాపుదల:**

1. Thrilling experience:మనము క్రొత్త అనుభూతులను రుచి చూసేలా సాతానుడు ప్రయత్నిస్తాడు. ఒక మనిషి (హవ్వ) పాముతో మాట్లాడడము ఒక క్రొత్త అనుభూతి కదా. మనలో చాల మందిని సాతానుడు ఇలాగే నాశనము చేయాలని చూస్తాడు. అయితే మన దేవుడు తన ఆనంద ప్రవాహములోనిది మనకు త్రాగించును (His river of delights) కీర్తన 36:8. ప్రతిసారి నూతనమైన మరియు తీసివేయబడని అనుభూతిని దేవుడు మనకిస్తాడు.

2. Impact of current generation:ప్రతి తరము యొక్క విష ప్రభావము ఆ తరములోని విశ్వాసులపై పడేలా అన్ని సదుపాయాలను సాతానుడు కల్పిస్తాడు. అయితే యెహోవా యందు నమ్మికయుంచువానిని కృప ఆవరించుచున్నది. కీర్తన 32:10. ప్రతి మోసము నుండి మనలను కాపాడుటకు ఆయన తన కృపను అనుగ్రహించుట మానడు.

3. Misquoting God's word:దేవుని వాక్యాన్ని తప్పుగా వివరించడము లేదా ఉదహరించడములో సాతానుడు మంచి నిపుణుడు. అవిశ్వాసులైన వారిని సువార్తకు వ్యతిరేకులుగా తయారు చేస్తాడు, విశ్వాసులైన వారు సాతానుని ఆధీనములో లేరు. గనుక తన మాయమాటలతో సత్యాన్ని వక్రీకరించి అది దైవ వాక్కు అని, దేవుని స్వరమని మరియు ఇదే దేవుని చిత్తమని నమ్మిస్తాడు. సువార్తను ప్రకటించకుండా చేస్తాడు. అయితే, పరిశుద్ధాత్ముడు మనలను సర్వ సత్యములోనికి నడిపిస్తాడు. వాక్యాన్ని సరిగ్గా గ్రహించుటకు, అన్వయించుకొనుటకు పరిశుద్ధాత్ముడు సహాయపడినట్లుగా ఇంకెవ్వరు సహాయపడరు. సాతానుడు అబద్ధ బోధకులను పంపిస్తే, దేవుడు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహము గల పరిశుద్ధాత్ముని పంపించాడు. 1 తిమోతి 1:7.

4. Self will:సాతాను యొక్క నిజమైన పాపము "... నా చిత్తము..." యెషయా 14:12-14లో మొత్తము ఐదు సార్లు సాతానుడు 'నా' అని తన చిత్తాన్ని నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వ్రాయబడింది. అదే తరహాలో మనము కూడా ఈ పాపము చేయాలని సాతానుడు ఆశపడతాడు. ఫలితముగా మనము దేవుని ఇష్టాన్ని కాదని మన చిత్తాన్ని చేయడము ద్వారా దేవుని అద్భుతమైన ప్రణాళికలన్నీ నాశనమవుతాయి. గర్వము, మూర్ఖత, అసూయ, వదరుబోతుతనము, అహము, పోటితత్వము, సొంత మహిమను వెదకడము మరియు స్వనాశనము ఇంకా మరెన్నో బయల్పరచబడుతాయి. అయితే, మనము ఆయనను అడుగగలిగితే ఆయన తన చిత్తమును మనకు తెలియజేస్తాడు. 2 దిన 32:24, దానిని మన జీవితంలో ఆయనే నెరవేర్చుతాడు. దేవుని చిత్తము అనేది దేవునికి మన యెడల గల ప్రేమను వెల్లడి చేయడము. దేవుని చిత్తము ఆయన హృదయములో నుండి జనిస్తుంది. కానీ, దేవుని చిత్తాన్ని సాతానుడు ఒక బాధ్యతగా మరియు భారముగా చూపిస్తాడు. అయితే దేవుని చిత్తము ఎంతో సంతోషకరమైన విషయము.

5. Sufferings:శ్రమలను గురించి దేవుని వాక్యములో ఎంతో స్పష్టముగా చెప్పబడింది. నీతిమంతునికి అనేక ఆపదలు కలుగుతాయని (కీర్తన 34:19), క్రీస్తు యేసు నందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించువారందరు హింసపొందుదురని (2 తిమో 3:12), క్రీస్తు నామము నిమిత్తము నిందలను,బాధలను, తిరస్కారములను, అవమానమును (1 పేతురు 4:12-13) పొందవలసియుంటుందని వివరించబడింది. అయతే, మనము ఈ సత్యమును గ్రహించకుండా మరియు మనమెదుర్కొను శ్రమలను సహించకుండా సాతానుడు మనల్ని మోసగిస్తాడు, మానసికముగా క్రుంగదీస్తాడు. కొన్ని సార్లు ఏదో ఊరట మరియు తాత్కాలిక ఉపశమనమును అందిస్తాడు. కొన్నిసార్లు మనము ఓడిపోయేటట్లు చేస్తాడు. నీ పని అయిపోయింది, నిన్నెవ్వరు ఆదుకోలేరు, నీవు నిష్ప్రయోజకుడవు మరియు దేవుని కొరకైన నీ నిర్ణయము తప్పు అని, దేవుని నమ్ముట వలన ప్రయోజనమేమి లేదని, తోటి సహవాసుల ప్రేమ అబద్ధమని మనకు హితోపదేశము చేస్తాడు. అదంతా అబద్ధము. మనము ఆయన నిమిత్తము నింద పాలైనప్పుడు మహిమ స్వరూపియగు ఆత్మ మన మీద నిలుచును (1 పేతు 4:14), శ్రమలన్నిటిలో నుండి దేవుడు నీతిమంతులను తప్పిస్తాడు (కీర్తన 34:19). ఆ శ్రమలన్నిటిలో నుండి ప్రభువు నన్ను తప్పించెను (2 తిమో 3:11) అని పౌలు చెప్పే సాక్ష్యమే దేవుని కాపుదలకు గొప్ప నిదర్శనము. గనుక, సాతాను పెట్టే ప్రలోభాలకు మనము లొంగక, ఆ శ్రమలను పొందుటకు పాత్రులని దేవుడు మనలను ఎంచినందుకు సంతోషించుదాము. అపొ.కా. 5:41.

6. Impatience:మన ప్రార్థనలకు త్వరగా జవాబులు రానప్పుడు, సమస్యలకు పరిష్కారము ఆలస్యమైనప్పుడు సాతానుడు మనల్ని అసహనానికి గురి చేస్తాడు.

ఫలితముగా దేవుని యందలి విశ్వాసము సన్నగిల్లి, భ్రమ, కలవరము, తారుమారు, గందరగోళము మరియు తలవంపుకు గురి చేయబడతాము. సాతానుడు మరియు మన శరీరము కలిసి పనిచేస్తున్నాయని గ్రహిస్తే, ఒక వేళ ఇదే కొనసాగితే అతి త్వరలోనే మనమనేక తప్పుడు నిర్ణయాలు చేస్తామని గుర్తుంచుకోవాలి. అయితే దేవుడు నా కృప నీకు చాలు (2 కొరింథీ 12:9) అని అభయమిచ్చాడు. ఆయన కృప అనేది ఒక మర్మముగా ఉన్న సారాంశము కాదు. అది మనకు సమస్య వచ్చినప్పుడు మాత్రమే కుమ్మరింపబడే ఆశీర్వాదము కాదు. దేవుని కృప అనేది దేవుని దాతృత్వము, అన్ని సమయాలకొరకు ముందుగానే అనుకూలపరచబడియున్న గొప్ప ఆశీర్వాదము. ఆ సర్వకృపానిధియగు దేవుడు మనలను కరుణించక మానడు (1 పేతు 5:10). ఆయన మన మనోభీష్టమును సఫలము చేయును, మన పెదవులలో నుండి వచ్చిన ప్రార్థనను మానక అంగీకరించును. శ్రేయస్కరమైన ఆశీర్వాదములతో మనలను ఎదుర్కొనును (కీర్తన 21:2-3).

7. Fleshy desires: దేవుడు మన శరీరాలను నశించిపోతున్న లోకమునకు తన వ్యక్తిత్వాన్ని బయల్పరచుటకు ఉపయోగించుకోవాలని చూస్తాడు. అయితే సాతానుకు కోర్కెలున్నవి, వాటిని నేరవేర్చుకోవడానికి వానికి శరీరాలు కావాలి. అందుకే వాడు మన శరీరాలను వాడు కోవాలని చూస్తాడు. శారీరక సుఖము, వ్యభిచారము, ధనము మొదలగునవి వాని అస్త్రాలు. జారత్వము రెండంచులు గల కత్తియంత పదును గలది, అది గాయపరచి పడద్రోసిన వారు అనేకులు, అది చంపినవారు లెక్కలేనంతమంది (సామె 5:4, 7:24). అయితే దేవుడు అనేక మందిని ఈ పాపము నుండి కాపాడాడు. ఆయన సమర్థుడు, మనకు బలమునను గ్రహించు వాడాయనే. తన ఆత్మ చేత మనము శారీరక క్రియలను చంపుటకు అధికారమును ఇచ్చాడు (రోమా 8:13).

ధనము అనేకమందిని చంపివేసింది, అది సమస్త కీడులకు మూలమైయున్నది (1తిమో 6:9-10), కొద్దిమందిని సాతాసుడు వారి ధనసమృద్ధితో, కొద్దిమందిని వారి లేమిని, పేదరికాన్ని ఆసరాగా చేసుకొని నాశనము చేస్తాడు. నీతిమంతునకు కలిగినది కొంచెమైనను బహుమంది భక్తిహీనులకన్న ధన సమృద్ధి కంటె శ్రేష్టమైనదిగా దేవుడు చూస్తాడు (కీర్తన 37:16). తన కుమారుని బలిగా ఇచ్చిన దేవుడు, ఎవ్వరు ఇవ్వలేని రక్షణను ఇచ్చిన దేవుడు తన వారికి అవపరమైయున్న యీవిని ఇవ్వగలడు. మన హృదయములను సంతృప్తితో నింపగలడు.

8. Meaningful life/Success: ఒకవేళ నేను ఆకర్షణీయముగా ఉంటే, నేను సక్సెస్ సాధిస్తే, నేను అందరి చేత గౌరవింపబడతాను, నేనొక ముఖ్యమైన వ్యక్తినౌతాను, అందరి చేత ప్రేమించ బడుతాను. ఇదే గాని జరిగితే, నా సమస్యలన్ని పోతాయి, గొప్ప స్థానముకు ఎక్కుతాను, యెదుటి స్రీలు/పురుషులకు నేనొక ఎదురులేని ఆకర్షణగా కనిపిస్తాను, నా స్నేహాన్ని, సలహాలు అందరూ ఇష్టపడతారు మరియు నా జీవితము అర్ధవంతమౌవుతుంది... అనే గొప్ప అబద్ధ మనస్సును సాతానుడు మనలో తీసుకువస్తాడు. ఒకవేళ, ఊహించినది జరగక పోతే నా జీవితము వ్యర్థము అని వాపోతుంటాము. క్రీస్తులో మనకున్న స్థానమును మనము మరిచిపోవునట్లు చేస్తాడు సాతానుడు. అయితే, మనకొక దేవుడున్నాడు, ఆయన పరిపూర్ణుడు, బలవంతుడు, ప్రేమ గలవాడు, నమ్మదగినవాడు. మరియు మన జీవితాల ద్వారా గొప్ప శాశ్వతమైన సంగతులను ఆయన జరిగించుటకు సిద్ధముగా ఉన్నాడని మనము మరువకూడదు. యెహోవా ఎదుట మౌనముగా ఉండి ఆయన కొరకు కనిపెట్టుకొనియుంటే మనము దేశమును స్వతంత్రించుకోవచ్చును (కీర్తన 37:7,9). మనమాయనను నమ్మాలి. నమ్మిక అంటే "... దేవుడు తన గురించి తానేమి చెప్పాడో, మన గురించి తానేమి చెప్పాడో అది ఖచ్చితముగా (absolutely) నిజమని నమ్మడము.

Conclusion: ప్రస్తుతము మనము నమ్ముచున్న ఏవైనా అబద్ధములు మన మనస్సులో ఉంటే వాటిని తొలగించమని దేవుని అడుగుదాము. ఆకాశమును భూమిని సృజించిన దేవుని వలననే మనకు సహాయము వచ్చును. మనలను కాపాడువాడు కునుకడు, నిద్రపోడు. ఏ అపాయము రాకుండా యెహోవా మనలను కాపాడును (కీర్తన 121:1-8). ఆయన మన క్షేమమును చూచి ఆనందించువాడు (కీర్తన 35:27). అది మన జీవితము ద్వారా రుజువుపరచబడిన, లేకపోయినా ఆయన మనకు ముందుగానే సాతానుపై జయమును అనుగ్రహించియున్నాడు (2 కొరింథీ 2:14, ఎఫెస్సీ 1:20-23). ప్రతిరోజు ఆయన ఇచ్చు కాపుదలను బట్టి ఆయనను ఆరాధించుదాము. ఈ నూతన సంవత్సరములో, దావీదు ఆకాంక్షించినట్లు మన పక్షముగా నిలబడుటకు దేవుని ఆహ్వానించుదాము (కీర్తన 35:23).

–సహో. డానియేల్, NIT వరంగల్.

# ఎటెన్షన్ టు అడిక్షన్




మన రక్షకుడైన క్రీస్తు యేసు నామములో నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రస్తుత కాలంలో అత్యధికంగా సమాజాన్ని పీడిస్తున్న పదం "వ్యసనం" (అడిక్షన్). ఈ 'అడిక్షన్' అనే ఆంగ్ల పదం 16వ శతాబ్దంలో, "Addictio" అనే లాటిన్ పదం నుండి తీసుకోబడింది. దీనికి డిక్షనరీ అర్థం ఏమిటంటే "The status of being addicted to a speicfic activity". వ్యసనాలు రెండు రకాలు. అనుకూల వ్యసనాలు (positive) మరియు ప్రతికూల వ్యసనాలు (negative). అనుకూల వ్యసనాలు చాలా లాభాలు చేకూరుస్తాయి. ఉదా॥ వ్యాయామం, ప్రతి దిన ప్రార్థన, ధ్యానం, క్రీడలు మొదలగునవి. వీటి ద్వారా మనలో అపరాధభావము రాదు. కాని అపరాధభావన కలిగించే ప్రతికూల వ్యసనాలు ఉన్నాయి. ఇవి చాలా భయంకరమైనవి. ఇవి దేవునికి ఎంత మాత్రము ఆమోదయోగ్యమైనవి కావు. అంతేకాక మానవుని శారీరక, మానసిక మరియు ఆత్మీయ స్థితిని ఎంతగానో ప్రభావితం చేస్తాయి.

ఒక సారి ఒక వ్యక్తి ఏదైనా అలవాటుకి బానిసగా మారితే, దాని నుండి విడుదల పొందడం బహు కష్టతరమైనది. కులము, మతము, ప్రాంతము, సంస్కృతి అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తి తన జీవితంలో ఏదో ఒక అలవాటుకు బానిసై యుంటాడని నా భావన. అది మంచి అలవాటు లేదా చెడు అలవాటైనా కావచ్చు. ఈ ప్రపంచములో ఎన్నో వ్యసనాలున్నాయి. కాని వాటన్నిటికి మూలం మన మట్టి శరీరమే (మత్తయి 15:11,17-19). మన శరీరము యొక్క ప్రేరణ లేనిదే ఏ వ్యసనాలు మనల్ని కదిలించలేవు. ఈ చెడు వ్యసనాలు ఖచ్చితంగా మనిషి శారీరక, మానసిక, ఆత్మీయ పతనానికి దారి తీస్తాయి. యేసు క్రీస్తు ఈ లోకంలోని సమస్త మానవాళికి నిత్య జీవాన్ని ఇవ్వడానికే జన్మించాడు. మనిషి యొక్క బంధకాల నుండి, వ్యసనాలనుండి విడిపించడానికే క్రీస్తు సిలువలో తన అమూల్యమైన పరిశుద్ధ రక్తాన్ని చిందించాడు. ఎవరైతే ఆయనను ఆశ్రయించి విశ్వసిస్తారో వారు తప్పకుండా చెడు వ్యసనాల నుండి విడుదల పొందుతారు. "నమ్ముట నీవలనైతే నమ్మువానికి సమస్తమును సాధ్యమే" (మార్కు 9:23).

అడిక్షన్ అనే పదం వినగానే మన మనస్సు ఒక వ్యసనాల జాబి తాను గుర్తు తెచ్చుకుంటుంది. అవేవనగా smoking, alcohol drinking, drugs, movies, fashion, music, playing cards, tik talk, facebook, games, mobiles, selfies, fun (fun makers and fun seekers), parties etc., ఇవి బాహ్యంగా అందరికి కనబడేవి. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న ఇంకొన్ని అంతర్గత వ్యసనాలు enjoying half nakedness or full nakedness, pornography, dating, masturbation, homosexuality, prostitution etc., వయస్సు, లింగ, కుల, జాతి మత బేధాలు లేకుండా ఇవి సమాజంలో చొచ్చుకొనిపోయాయి. చాలా మంది అవిశ్వాసులు పైన పేర్కొన్న వ్యసనాలలో జీవిస్తున్నారని మనకు తెలుసు. కొందరికి ఆశ్చర్యంగా ఉన్న నమ్మదగిన వాస్తవం ఏమిటంటే విశ్వాసులైన కొంతమంది విద్యార్థులలో కూడా ఆ చెడు వ్యసనాలు ఉన్నాయి. విశ్వాస విద్యార్థులను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. క్రీస్తును అంగీకరించిన తర్వాత కూడా వారి గత వ్యసనాలను ఎదుర్కొనే క్రైస్తవులు. వీరు దేవుని సహాయముతో వారి వ్యసనాలకు వ్యతిరేకంగా పోరాడి అనేక ప్రయత్నాల తరువాత శాశ్వత విజయాన్ని పొందుతారు. కొందరైతే తక్కువ సమయంలోనే పరిపూర్ణ విడుదల పొందుతారు.

2. మరికొందరు క్రైస్తవ విద్యార్థులు వారి గత జీవిత అలవాట్లతో పోరాడి స్వల్పకాలానికి విజయాన్ని సాధిస్తారు. వ్యసనాలు సుళువుగా చిక్కులు పెట్టు పాపం గనుక, వారి శరీరం సహకరించక తిరిగి పాత జీవితాన్ని కొనసాగిస్తారు. దేవుడు గద్దించిన సమయాల్లో (వాక్యం, సంఘం) పశ్చాత్తాపపడి దురలవాట్లను విడిచిపెడతారు. కొద్ది కాలానికే మరల పాప జీవితానికి వెళ్తారు. ఇదే చక్రాన్ని (cyclic process) మరణం వరకు కొనసాగించి చివరికి నరకంలో చోటు దక్కించుకుంటారు (యాకోబు 1:14-15).

Addiction cycle in a believer:

శరీర అంతర్గత ప్రేరణ ⟶ వ్యసనాలకు చెందిన క్రియలు ⟶ స్వల్ప కాలానికి ఆనందం (pleasure) ⟶ అసంతృప్తి (అపరాధభావం) ⟶ శరీర అంతర్గత ప్రేరణ.

3. క్రీస్తుని అంగీకరించక ముందు వ్యసనాలు లేని విద్యార్థులు. ఇందులో కొందరు వ్యసనాలకు బానిస కాకుండా యేసులో ఆనందకరమైన జీవితం గడుపుతారు. ఒకవేళ వ్యసనాలు ఎదురైనా జయించగలుగుతారు. అయితే మరికొందరు పరిస్థితులు లేదా నివసించే ప్రాంతాల ప్రభావం వల్ల వ్యసనాలకి గురై మరింత దిగజారిన స్థితికి వెళ్ళిపోతారు (మత్త 12:43-45). కావున నూతన విశ్వాసికి సహవాసం చాలా ప్రాముఖ్యమైనది.

కాబట్టి అంగీకరించాల్సిన సత్యం ఏమనగా, ఒక విశ్వాసి జీవితంలో ఏదైనా జరగవచ్చు. ప్రతి వ్యక్తి బాహ్య మరియు

అంతర్గత జీవితాలు కలిగియుండుటకు అవకాశాలున్నాయి. కాని దేవుడు మన నుండి ఆశించేది పారదర్శక జీవితం. ఒకే స్వభావం, ఒకే జీవితం. ద్వంద్వ స్వభావాన్ని దేవుడు సహించలేడు. ఇంతకుముందు పేర్కొన్న వ్యసనాలే గాక విశ్వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒంటరితనం, చింత, నిరాశ (depression leads to suicide) రాజీపడే మనస్సు, ప్రేమ వ్యవహారాలు మొదలగునవి.

**వ్యసనాల్లో పడిపోవడానికి కారణాలేంటి?**

ప్రధానంగా మనిషి యొక్క పాప స్వభావం (రోమా 3:23)

1.యోహా 2:16 లో చెప్పబడిన ప్రకారం ఒక విశ్వాసి లోకంలో ఉన్న శరీరాశ (desires of flesh), నేత్రాశ, జీవపుడంబములనే మూడు విధాల ద్వారా శోధింపబడతాడు. విశ్వాసి శోధనలో జయించకుండ చేసేవి మూడు. అవి మన శరీరం, లోకము, సాతాను. అపవాదియైన సాతాను ఈ లోకాన్ని ఉపయోగించుకొని మన (విశ్వాసుల) శరీరంపై దండెత్తుతాడు. మనలో వాక్యం లేనట్లయితే ఎదుర్కోలేము. మన ఆత్మను బలహీనపరుస్తాడు. పాపాన్ని మరల చేయుటలో నీ శరీరం ప్రధాన పాత్ర పోషిస్తుంది. విశ్వాసిగా ఆయన రాజ్యమును, నీతిని వెదకకుండ ఆయన వాక్యానికి విధేయత చూపకుండ నీ హృదయములో ఆయనకు ప్రథమ స్థానం ఇవ్వనట్లయితే నీవు సాతాను బోనులో చిక్కినట్లే. మన శరీరంలో "డోపమిన్" అనే రసాయనం హార్మోన్‌గా, న్యూరోట్రాన్స్‌మిట్టర్‌గా పనిచేసి, పాపాన్ని మరల మరల చేయడానికి ఉపయోగపడుతుంది. విశ్వాసిని వ్యసనాల్లోకి లాగే మార్గాలు సినిమాలు, రియాల్టీ షోలు, అనవసరమైన వీడియోలు మొ॥. ప్రారంభ దశలో వ్యసనాన్ని విడిచి పెట్టకపోతే, అది మరిన్ని వ్యసనాలకు దారి తీస్తుంది. ఉదా॥ అశ్లీల చిత్రాలు చూడడమనేది, తర్వాత దినాలలో వ్యభిచారం/ జారత్వం వైపుకు దారి తీస్తుంది. ఫ్యాషన్ (fashion) కూడా మనుష్యుల చేత పొగడబడాలనే కోరిక పుట్టిస్తుంది.

**ఈ చెడు వ్యసనాల నుండి విడుదల ఎలా సాధ్యం?**

చెడు వ్యసనాలకు గురైన విశ్వాసి ఎప్పుడూ తన వ్యసనాల నుండి బయటకు రావాలని ప్రయత్నిస్తూవుంటాడు. కాని తన శరీరం సహకరించదు. సులువుగా రెప్పపాటులోనే తన చెడుకార్యాలను చేస్తూ ఉంటాడు. అపోస్తులుడైన పౌలు తను రోమీయులకు వ్రాసిన ప్రతికలోని 8వ అధ్యాయములో శరీరానికి, ఆత్మకు జరిగే పోరాటం గూర్చి చక్కగా వివరించాడు. చెడు వ్యసనాల నుండి విముక్తి పొందాలంటే, కొన్ని సూచనలు చూద్దాం.

1.మొదటగా పౌలు రోమా 6:19లో చెప్పినట్లుగా " పాపము మీ మీద ప్రభుత్వం చేయదు" అనే విషయాన్ని దృఢంగా నమ్మాలి. యథార్థంగా యేసు క్రీస్తు పాదాల చెంత ప్రాయశ్చిత్త హృదయంతో చేసిన పాపాలను ఒప్పుకొని ఆయనతో సహవాసంలో కొనసాగడం అలవరచుకోవాలి.

2.మన శరీరాలను సజీవ యాగముగా మన దేవునికిసమర్పించుకోవాలి (రోమా 12:1-2). అప్పుడు క్రీస్తుసిలువలో కార్చిన పరిశుద్ధరక్తంలో నిన్ను కడిగి నీకు వ్యసనాలపై విజయాన్ని ఇస్తాడు.

3.ఉపవాసంతో ఎడతెగక, విసుగక విరిగినలిగిన హృదయంతో ప్రార్థించు (మార్కు 9:29). తగ్గింపు హృదయంతో, ప్రాయశ్చిత మనస్సుతో ఆయన సన్నిధి చేరు.

4.మన పరలోక స్వాస్థ్యముకు సంచకరువుగా ఉన్న పరిశుద్ధాత్మ దేవుని సహాయాన్ని వెదుకు (ఎఫె 1:14). నీ హృదయంలో వినబడే ఆయన స్వరానికి లోబడి జీవించుట అలవరచుకో.

5.నిన్ను నిన్నుగా అర్థం చేసుకునే నమ్మకమైన మెంటర్‌ని (అన్న లేదా అక్క) కలిసి, నీ సమస్యను పారదర్శకంగా వివరించు. నీ మెంటర్‌కి జవాబుదారిగా ఉండు. ఇందువల్ల నిజ జీవితంలో నీవు ఎదుర్కొంటున్న వ్యసనాలకు తగిన పరిష్కారం దొరుకుతుంది.

6.స్వల్పకాలిక లక్ష్యాలను పెట్టుకొని, క్రమంగా నీ వ్యసనాలనుండి బయటకు రావచ్చు.

7.ఒంటరిగా నుండుట చాలా ప్రమాదకరం. ఎప్పుడూ విశ్వాస విద్యార్థులతో సహవాసంలో ఎదగండి. మౌన ధ్యాన సమయం (quite time) లో కావాలసినంత సమయం గడపండి.

8.లోకపరమైన విషయాలకన్న, దైవిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వండి


9.చెడు వ్యసనాల నుండి విడుదల చెందిన విద్యార్థుల సాక్ష్య జీవితాలను చదవండి.

చెడు వ్యసనాలతో నలిగిపోతున్న క్రైస్తవ విద్యార్థులు నీ చుట్టూనే (గది/హాస్టల్/ఇయు/ఇజియఫ్ లలో) ఉన్నారేమో? వారు మీతో తమ సమస్యలను తెలియజేయక పోయి ఉండవచ్చు. మనమే వారి సమస్యలను చదివి, అర్థం చేసుకోగలుగుతున్నామా? ఒక విద్యార్థి మన దగ్గరికి వచ్చి తన వ్యసనాలు, సమస్యలు చెప్పుకోగలిగే విధంగా మన జీవితాలు ఉన్నాయా? నీ స్పందన ఏంటి? ఆ విద్యార్థి స్థితిని అంగీకరించి, ఆ సమస్యకి మార్గాన్ని చూపించగలుగుతున్నామా?

2019 వ సం॥లో టిక్ టాక్ వ్యసనంగా మారింది.సమాజం మారుతుంది. అదే తరహాలో ఈ నూతన సం॥లో మరిన్ని కొత్త వ్యసనాలు కూడా రావచ్చు. మనలో చాలా మంది 2020 జనవరి 1వ తేదిన ఉద్వేగంతో కూడిన నిర్ణయాలు ఎన్నో తీసుకొని ఉంటాం. ఈ నూతన సం॥లో వ్యసనాల్లో చిక్కిన క్రైస్తవ విద్యార్థులను కౌన్సిలింగ్ చేయుటకు, సంబంధాలను పెంపొందించుటకు ఒక సరియైన నిర్ణయం తీసుకుందామా! తద్వారా ఇయు /విశ్వాస విద్యార్థులుగా తమ కళాశాలలో, వసతి గృహాలలో పరిశుద్ధంగా, క్రీస్తుకు సాక్షిగా జీవించగలరు. ఇది రాబోయే రోజుల్లో అద్భుతమైన నాయకత్వానికి నాంది పలుకుతుంది. తుది వరకు ప్రతి దినము విజయుడైన యేసుతో విజయవంతమైన జీవితాన్ని కలిగియుండడానికి దేవుడు మనకందరికి సహాయం చేయును గాక!

PUZZLE

## జనవరి '20 పజిల్ – మలాకీ (1–4 అధ్యాయములు)




**అడ్డం:**

4. యాజకులు ఏ అర్పణచేత దేవుని అపవిత్రపరిచారు?
6. ఏ పాపాన్ని బట్టి దేవుడు ఇశ్రాయేలును శాపగ్రస్తులుగా చేసాడు?
7. భార్యాభర్తల విషయంలో దేవునికి అసహ్యమైనది ఏమిటి?
8. నిబంధన దేనికి కారణము?
9. దేవుని మందిరములో రోదనము చేత తడపబడుచున్న దేమిటి?

**నిలువు:**

1. యెహోవాకు విరోధముగా హేయక్రియలు జరుగుచున్న పట్టణమేది?
2. చెడిపోయినదానిని అర్పించువాడు దేవుని దృష్టిలో ఎటువంటివాడు?
3. దేవుని నామమును నిర్లక్ష్యపెట్టినవారెవరు?
5. లేవీయులకు దేవునికి మధ్య ఉన్నదేమిటి?
7. మనిషి దేవుని దగ్గర చేసిన దొంగతనమేమిటి?

**– సహోదరి.త్రివేణి శ్రీను, రామాంతపూర్.**

## డిసెంబర్ '19 పజిల్ – హగ్గయి (1–2 అధ్యాయములు)

**జవాబులు మరియు రెఫరెన్సులు**

**అడ్డం:**

3. క్షామము (1:11)
6. యెహోజాదా (1:1)
8. యెహోవా మందిరము (2:7)
9. తెగులు కాటుక వడగండ్లు (2:17)

**నిలువు:**

1. ధర్మశాస్త్రము (2:11)
2. ద్రాక్ష అంజూర దానిమ్మ ఒలీవ (2:19)
4. అపవిత్రములు (2:14)
5. యెహోషువా (1:1)
7. షయల్తీయేలు (1:1)

**విజేతలు** 1.సంతోష ఇమ్మానుయేలు, సంగారెడ్డి, 2.మైఖేల్ కాంత్, మంచిర్యాల, 3.జి.ప్రశాంతి, వరంగల్

### జగతి మురియాలి...

యువత మన భవిత
యువత మన చరిత
యువత మన ఘనత
యువత మన ప్రగతి
యువత మన సుగతి
యువత మన పురోగతి
యువత మన ఆశాదీపం
యువత మన అభ్యుదయ రూపం
యువత మన ప్రాణ దీపం
అట్టి యువత నేడు
పబ్బులలో తూలుతోంది
క్లబ్బులో సోలుతోంది మత్తులలో ఊగుతోంది
లక్ష్యం లేని గమ్యం వైపు
సాగుతోంది...
మేధస్సు వైపు గాక
మనస్సు వైపు సాగుతోంది
అకృత్యాలకు అత్యాచారాలకు
వెనుకాడకుంది...
అయితే, క్రీస్తు ప్రభువు పరిచయంతో
ఇక దురలవాట్లకు దూరమై
ధర్మ పదానికి చేరువై
క్రమ శిక్షణ రూపమై
తన లక్ష్యమే గురియై
యువత సాగాలి
జగతి మురియాలి **– సహో.డేవిడ్ రాజు** నిజామాబాద్.

TREASURER'S REPORT

# కోశాధికారి కలం నుండి.....

"...పరలోకము నుండి అనుగ్రహింపబడితేనేగాని యెవడును ఏమియు పొంద నేరడు." (యోహాను 3:27)

ప్రియమైన యుఇయస్ఐ–టియస్ సభ్యులకు ప్రభువైన యేసు క్రీస్తు నామములో శుభములు.
అందరికి 2020 నూతన సంవత్సర శుభాకాంక్షలు. మరియొక నూతన దశాబ్దము లోనికి మనలను దేవుడు ప్రవేశింప చేసినందుకు ఆయనకే హృదయపూర్వక వందనములు.

బైబిల్ గ్రంథంలో అనేక గొప్ప దైవజనులచేత లిఖింపబడినట్లుగా, ఆయన అనుగ్రహిస్తేనే తప్ప ఏదియు మనము పొందలేము. అది ఒక నూతన దినమైనా, సహవాసమైనా, ఆరోగ్యమైనా, బలమైనా, సంపాదించుకొనుటకు అవసరమైన సామర్థ్యమైనా, మనకున్న సంపదైనా, ఇళ్లయినా, వాహనమైనా, ఉద్యోగమైనా అన్ని ఆయన కృప వలననే అనుగ్రహింపబడతాయి

దావీదు దేవుని మందిర నిర్మాణము గురించి ప్రార్థనలో ఈ విషయము స్పష్టముగా పలుకుతాడు. "ఈ ప్రకారము మన:పూర్వకముగా ఇచ్చు సామర్థ్యము మాకుండుటకు నేనంత మాత్రపువాడను? నా జనులెంత మాత్రపు వారు? సమస్తమును నీవలననే కలిగెను గదా? నీ స్వసంపాద్యములో కొంత మేము నీకిచ్చియున్నాము." (1 ది.వృ 29:14). కాబట్టి దేవుడు మనకు ప్రతి దినము అనుగ్రహిస్తున్న అన్నిటి నుండి శ్రేష్టమైనదానిని ఆయనకు ఇవ్వడము మనకు ఆశీర్వాదకరము.

> ప్రశ్న: స్టడీ సెంటర్, డైనింగ్ హాల్, రెండవ ఫ్లోర్ మరియు మీటింగ్ హాల్స్ ఎప్పటినుండి వాడుకలోకి వస్తాయి?
> జవాబు: దేవుని చిత్తమైతే 2020 మే నెల నుండి వాడుకలోకి వస్తాయి. ప్రార్థనాపూర్వకముగా తప్పకుండా స్పందించగలరు.

**స్తుతించండి:**

1స్టాఫ్‌కు సకాలంలో 100% జీతములు ఇవ్వగలిగిన దాన్ని బట్టి
2.మన ప్రియమైన స్టాఫ్‌కి క్రిస్మస్ గిఫ్ట్ ఇచ్చిన దాన్ని బట్టి
3.స్టడీ సెంటర్ నిర్మాణ పనులు వేగముగా జరుగుతున్న దాన్ని బట్టి

**ప్రార్థించండి:**

1.ప్రతి నెల బడ్జెట్ రూ. 7.7 లక్షల కొరకు, నూతన బడ్జెట్‌కు తగిన విధముగా అన్ని ఇయు, ఇజియఫ్‌లు స్పందించులాగున.
2.స్టడీ సెంటర్ 2 మరియు 3వ ఫేజ్ నిర్మాణ పనులు పూర్తి చేయడానికి అవసరమైన రూ. 62 లక్షల కొరకు.

ఇట్లు,
క్రీస్తులోమీ సహోదరుడు,
డి. అనీల్ కుమార్

| UESI - TS MONTHLY REQUIREMENT - Rs. 7.7 Lacs. | | | |
|---|---|---|---|
| December'19 | | | |
| **RECEIPTS** | Rs. | **PAYMENTS** | Rs. |
| General Contribution | 5,81,119 | Field Staff Salaries | 4,33,402 |
| Staff Support | 62,500 | Office Staff Salaries | 68,547 |
| UESI | 1,68,358 | Office Rent | 12,800 |
| | | Repairs & Maintenance | 8,282 |
| | | UESI | 1,93,358 |
| | | Bihar | 16,000 |
| | | NEGF | 3,000 |
| | | Closing Balance | 76,588 |
| **Total** | **8,11,977** | **Total** | **8,11,977** |



# ఎటు నీ ప్రయాణం?

పోతున్నావా, తర్వగా ముందుకు
పోతున్నావా నా సంవత్సరాలు గడిచేకొలది
అవునా, అయితే ఎటు నీ ప్రయాణం, ఏది
నీ గమ్యం
నిత్య విశ్రాంతి పొందే నివాస స్థలముకేనా?
పోతున్నావా, ఏది నీ దారి, ఏది నీ గమ్యం?

పోతున్నాయి, తర్వగా ముందుకు
పోతున్నాయి సమయ సందర్భాలు
కాలపు చక్రాన్ని లాగవుగా, అదిగో
కొందరు పోతున్నారు మహానందపు రోజుకు
క్రీస్తే వారికి మార్గము, సత్యము, జీవము,
క్రీస్తే వారికి నాయకుడు

పోతున్నారు, తర్వగా ముందుకు పోతున్నారు
ఎందరో పోతున్నారదిగో విశాల మార్గం అది నరకం
అమరత్వముగల ఆత్మలను మరచారు
దేవుని పిలుపును విడిచారు
రక్షకుని రక్తమును కాలదన్నుతూ పోతున్నారు నాశనానికి

ఏది నీ దారి, ఏది నీ గమ్యం
యేసే నీ దారియైతే నడువుము సత్యమార్గములో
యేసే నీ గమ్యమైతే చేరెదవు నిత్య రాజ్యానికి
యేసే నీ నిరీక్షణ అయితే అదియే పరిశుద్ధ ప్రభువుతో సహవాసము
చూడుము యేసు వైపు, వేడుము పాపక్షమాపణ
తప్పించుకో నిత్యశిక్ష, పొందుకో నిత్యరక్షణ

– సహో.టి.తుకారామ్, సిరిసిల్ల.

Edited Printed and Published by Mr. Sudhir Kumar Gaddam for UESI-TS Publication Trust, Flat No.107,
Archana Enclave, Near Mahindra Hills Cross Road, East Marredpally, Secunderabad-500026 and
Printed at Marvellous Printers, Nallakunta, Hyderabad.